**PRAMUKHANDHRA** 28th Year of Publication **We carry the news and views of Telugus**



వ్యవస్థాపకులు
శ్రీ గోపేటి శ్రీ రామారావు

28 వ సంవత్సరం

# ప్రముఖాంధ్ర

₹.15
మార్చి 2022



THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA

# 78

# వసంతాల దివ్య జన్మదినోత్సవం



శ్రీ శ్రీ శ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ 78వ దివ్యజన్మదినోత్సవ
సందర్భంగా వారి దివ్య పాదపద్మములకు ప్రణామములు.

– గోవేటి వెంకటేశ్వరరావు



# ప్రముఖాంధ్ర

**ప్రపంచ తెలుగుల మానస పత్రిక**

మార్చి 2022

సంపుటి : 28 **327** సంచిక : 3




# ఇది గాంధీ పుట్టిన దేశమా? గాంధీ కలలుగన్న రామరాజ్యమా?

భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చినది గాంధీ (ఇందిరా గాంధీయో, రాజీవ్ గాంధీయో, సోనియాగాంధీయో కాదు). మోహన (మహాత్మా) దాస్ కరమ్‌చంద్ గాంధీమహాత్ముని నాయకత్వం. ఆయన కలలు కన్నది రామరాజ్యం. ఆయన విశ్వసించినది 'భగవద్గీత' గ్రంథం. బ్రిటిష్ దొరలు కూడా ఈ గ్రంథం జోలికి పోలేదు. న్యాయస్థానంలో ప్రమాణాలను సహితమూ ఈ గ్రంథమ్మీద ప్రమాణం చేయడానికి అభ్యంతరం చెప్పలేదు.

ఈ విశ్వాసాన్ని అలహాబాద్ లోని ఓ జడ్జి పుంగవుడు న్యాయమూర్తి శ్రీఎస్.ఎన్.శ్రీవాత్సవ ఆగస్టు 30న తన తీర్పులో 'భగవద్గీత'ను భారత 'ధర్మశాస్త్రం'గా భావించడం తప్పనిసరి, సమంజసం అన్నారు. మనకు స్వాతంత్ర్యం సిద్ధించిన అరవై సంవత్సరాలకు ఒక న్యాయమూర్తి యైనా ఈ సత్యం గుర్తించడం ఆనందకరమని భావిస్తున్న తరుణంలో, భారతదేశపు న్యాయశాఖా మంత్రియైన శ్రీ హెచ్.ఆర్. భరద్వాజగారు ముస్లిములకు 'ఖురాను', క్రైస్తవులకు 'బైబిల్' ధర్మశాస్త్రములై ఉండగా, పూర్ణ భారతదేశానికి ధర్మశాస్త్రంగా 'భగవద్గీత'ను ఎలా అంగీకరిస్తామనడం హాస్యాస్పదంగా ఉంది.

ఆయన భారతదేశాన్నీ, భారతీయతనూ, భగవద్గీత సారాంశాన్నీ మరిచిపోయేరేమోననిపిస్తూంది. సర్వధర్మసారము భగవద్గీత. ఏ మతములూ పుట్టనపుడు భగవద్గీత పుట్టింది. విశ్వజనులుత్తేజపరిచిన ధర్మశాస్త్ర గ్రంధము భగవద్గీత. సత్కర్మను చేయడం, సమస్త ప్రాణులూ సుఖముగా ఉండాలని కాంక్షిస్తూ, అకర్మలను చేసిన వారి శిక్షించాలనీ, ధర్మ సంస్థాపనా, న్యాయరక్షణమే ఉత్తమమని సూచించిన ఏకైక గ్రంథం. ఎవరు చెప్పినా, ఏ మతం చెప్పినా ఈ సూత్రాలనే ప్రధానంగా తీసుకున్నారు. న్యాయశాఖామాత్యులు స్వతంత్ర భారత చరిత్రను తెలుసుకొన్నట్టుగా కనిపించుటలేదు. స్వాతంత్ర్యం సిద్ధించే సందర్భంలో ముస్లిములు దేశ విభజన జరగాలనీ, తాము తమ ప్రత్యేక దేశాన్ని ఏర్పరచుకుంటామనీ అంటూ పాకిస్థాన్ ఏర్పరచుకుని వెళ్లిపోయారు. అలా వెళ్లడాని కిచ్చగించని ముస్లిములు భరతభూమి పట్ల తమ విశ్వాసాన్ని ప్రకటిస్తూ, ఇక్కడే ఉంటామన్నారు. మహాత్ముడు అంగీకరించారు. ఇహ క్రైస్తవం ఇక్కడిది కానేకాదు. సర్వధర్మ యుతంగా సకల ప్రాణులకు రక్షణ కల్పించే శ్రీరామచంద్రుని ఆశయంగా అందరికీ ఆశ్రయం కల్పించిన భరతఖండం తన ఉనికి, సంస్కృతి, శాస్త్రధర్మాలనూ విడనాడాలని మంత్రిగారు చెప్పడం విడ్డూరంగా ఉంది. భారతదేశంలోని ప్రతి పౌరుడూ ఈ సత్యాన్ని గ్రహించాలి.

బుద్ధిమంతులైన భారతీయులు తమ ఉనికిని, సంస్కృతిని కాపాడుకుంటూ మహాత్మా (అసలు గాంధీ) గాంధీగారు కన్న రామరాజ్య ధర్మానికి భంగం కల్పించరనే విశ్వసిస్తున్నాను.



బుధజన విధేయుడు

*– గోటేటి శ్రీరామారావు*

(అక్టోబర్ 2007)


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

ఉగాది పండుగ వచ్చిన తరువాత వచ్చే తొలి పండుగే శ్రీరామనవమి. ఉగాది నుండే సీతారామ కల్యాణశోభ ప్రారంభ మవుతుంది. దీనినే వసంత నవరాత్రములంటాం. సీతాదేవిని వైదేహిగా పిలుస్తాం. కౌసల్యా రాముడు కోసలేంద్ర రాకుమారి తనయుడు.

రాముడెవరయా – ఏ వంశీయుడు అంటే ఏడు తరాలను చెప్పుకోవాలి. ప్రతీ వారూ తమ తాత తండ్రులను ఏడు తరాల వరకూ చెప్పుకోవాలి. ప్రస్తుతం మూడు తరాలెరిగిన వారే లేరు.

భారతీయ ఆచారం ప్రకారం ఏడు తరాలనూ తెలుసుకోవాలి. ఇక్కడ వాల్మీకి పదితరాలను చెప్పాడు. కాబట్టి రఘురాముని ఏడు తరాల్నూ ఒకసారి చెప్పుకుందాం.

1. సకల చరాచర సృష్టికర్త బ్రహ్మ సుపుత్రుడు మరీచి.
2. మరీచి కుమారుడు కశ్యపబ్రహ్మ.
3. కశ్యప పుత్రుడు సూర్యుడు.
4. సూర్యపుత్రుడు మనువు.
5. మనువు కుమారుడు ఇక్ష్వాకువు.
6. ఇక్ష్వాకుని తనయుడు కాకుస్థుడు.
7. కాకుస్థుని తనయుడు రఘువు.
8. రఘువు యొక్క సుతుడు అజుడు.
9. అజుని కుమారుడు దశరధుడు
10. దశరధుని వరపుత్రులే శ్రీరామ, భరత, లక్ష్మణ, శతృఘ్నులు

ఇక్కడ శ్రీరామ, అనుజులు ముర్వురూ వసంత నవరాత్రంత్య నవమి నాడు జన్మించారు. చైత్రశుద్ధ నవమినే శ్రీరామజన్మదినంగా చెప్పుకుంటాం. ఆరోజుననే సీతారాముల కళ్యాణం జరిపించడం లోకోత్తర ఆచారంగా వస్తూంది.

**కోన్వస్మిన్ సాంప్రదతేలోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్**




**శ్రీరాముని దయచేతను**
**నారూఢిగ సకల జనులు**
**నౌరాయనగా ధారాళమైన నీతులు**
**నోరూరగ చెవులు పుట్ట నుడివెద సుమతీ!**

ఇలా ఎందరో ఎందరెందరో రామనామ శబ్దాన్ని రక్తి కట్టించే ధోరణిలో స్తుతించారు, నుతించారు.

**'రామాయ, రామభద్రాయ, రామ చంద్రాయ వేధసే రఘునాధాయ, నాధాయ, సీతాయా పతయే నమః'** అని నిష్కామంగా నమస్కరించే భక్తులకి శ్రీరాముడు కూడా వశం కాక మరేమౌతాడు?

అసలు సీతారామ ప్రాశస్త్యం గురించి తెలుసుకోవాలంటే, ఈ శ్లోక మాలిక హృదయస్థం చేసుకొని తీరాలి.

**'అయోధ్యా పూర్ణ నేతారం, మిథిలా పురనాయకీ,**
**రాఘవానాం, అలంకారం, వైదేహతనాం అలంక్రియం**
**రఘూనాం కులదీపంచ నిమీనం కులదీపికా**
**సూర్యవంశ సముద్భూతం, సోమవంశ సముద్భవం**
**పుత్రం, దశరథశ్యాపి, పుత్రీ జనక భూపతే**
**వసిష్ఠాను మతాచారం శతానంద గతాయుగ**
**కౌసల్య గర్భసంభూతం వేది గర్భోదితస్వయం**
**పుండరీక విశాలాక్షో స్ఫురదండి వరేక్షణమ్**
**మత్తమాతంగ గమనం మత్త హంస వధూగతం**
**చంద్రానార్ధ భుజమధ్యం కుంకుమాంకిత భుజాంతరం**
**సర్వలోక విధాతారం, సర్వలోక విధాయినీ**
**లోకాభిరామం శ్రీరామం అభిరామంచ మైథిలీ**
**దివ్య సింహాసనారూఢం దివ్య స్వగ్వస్త్ర భూషణం**
**అనుష్కాణాం కటాక్షాభ్యాం అంకోణేక్షిణ కాంక్షిణం**
**అన్యోన్య సాదృష్టద్యోపి త్రైలోక్య గృహదాంపతిం**
**ఇమే యువౌ ప్రణమాహ్యం భాజం ఎత్తి కృతార్థః**
**అనాయశ్చైతి ఎత్యుశ్యాం శ్రీరామం సీతంచ భక్తితః**
**తస్యాత్ తను తప్రీతౌ సంప్రసాద స కళా అపి**
**ఇతీథం హనుమత పుణ్యం స్తోత్రం సజ్యో నిముక్తికం**
**యః పఠేత్ ప్రాతరుద్ధాయ శ్రవణ్ కామనువప్నుయాత్**
**ఇదం పఠతి స్తోత్రం శ్రీ మైథిలీ రామచంద్రయోః**
**శ్రీ వైకుంఠ వాప్నోతి స్మరో హతకిల్భీషః'**

ఇలా లౌకిక తాపత్రయాలను మరచి, అనునిత్యం సీతారామ స్మరణమూ, మననమూ చేయగలిగితే, ఐహిక ఆముష్మిక సౌఖ్యాలకి కొదవేముంటుంది.

రామ మంత్ర రమణంతో...

(5వ పేజీ చూడండి)

శ్రీ రామం రామరామేతి మధురం మధు రాక్షరం, ఆరుహ్య కవితాశాఖం, వందే వాల్మీకి కోకిలమ్ అని రామాయణకర్త వాల్మీకి కవీంద్రుని స్తుతించిన వారెవరు?

అలాగే ఓ కవి మొత్తం రామాయణగాథను ఒకే శ్లోకంలో చెప్పారు!

**పూర్వం రామ తపోవనానుగమనం, హత్వామృగం కాంచనం**
**వైదేహీ హరణం జటాయు మరణం సుగ్రీవ సంభాషణం**
**వాలీనిగ్రహణం, సముద్రతరుణం లంకాపురీ దహనం**
**పశ్చాద్రావణ కుంభకర్ణ నిధనం హే తద్ది రామాయణం**

అంటూ రామయణా కథాసారాన్ని ఏక శ్లోకంతో వివరించారు.

**రఘుపతి రాఘవరాజారాం**
**పతీత పావన సీతారాం**

– అంటూ రెండే పాదాలతో స్తుతించారు మహాత్మాగాంధీ.

సుమతీ శతక కర్త ఇంకా చక్కగా చిక్కని మాటలతో రామభక్తి నీవిధంగా నాలుగు పాదాల్లో వివరించారు.

# శ్రీ సీతారాముల కల్యాణము చూతము రారమ్మా!

ఆమె తన తోటి పిల్లలతో ఆడుకుంటూండగా వారు ఆడే బంతి అక్కడ వున్న శివధనుస్సున్న పెట్టె కిందికి పోయింది, ఆ పెట్టెను పక్కకి జరపడానికి ఎవ్వరికీ సాధ్యం కాలేదు. సీత వెళ్లి తన ఎడమచేతితో దానిని పక్కకి జరిపి బంతిని బయటికి తీసింది. అది చూసిన జనకుడు ఆనాడే సంకల్పించుకున్నాడు, సీతయొక్క శక్తి సామర్థ్యములు ప్రపంచానికి చాటాలని, ఒక యజ్ఞమును తలపెట్టి, శివధనుస్సును ఎవరైతే ఎక్కుపెట్టగలరో వారికి సీతనిచ్చి పెండ్లి చేస్తానని ప్రకటించాడు. "జనక మహారాజు కుమార్తె చాలా గొప్పది. జనక మహారాజంతటివానికి అల్లుడు కావడం గొప్ప అదృష్టం" అని భావించి, అన్ని దేశముల యొక్క రాజులు అందరూ అక్కడికి వచ్చారు. ఒకరి తరువాత ఒకరు వరుసగా వచ్చి శివధనుస్సును ఎత్తడానికి ప్రయత్నం చేశారు. కాని, ఎవ్వరికీ సాధ్యం కాలేదు. విశ్వామిత్రుని వెంట వచ్చిన రామలక్ష్మణులు ఈ సభలో ఉన్నారు. విశ్వామిత్రుని సూచన మేరకు రాముడు ముందుకు వెళ్లాడు. ఎంతో వినయంగా ఆ పెట్టె దగ్గరకి వెళ్ళి శివధనుస్సును ఎడమచేతితో ఎత్తాడు. అది అసాధ్యమని భావించారందరూ! రామునికి సాధ్యం కానిదేమున్నది! సంకల్ప మాత్రం చేత దేనినైనను సాధించగలడు. ఆ ధనుస్సును ఎడమచేతిలోనే వంచాడు. తక్షణమే అది పెద్ద శబ్దం చేస్తూ విరిగిపోయింది. అందరూ కరతాళ ధ్వనులు చేశారు. అపుడు విశ్వామిత్రుడు రాముని దగ్గరకు వెళ్లి, రామా! ఈనాడు నీ దివ్యత్వమునకు తగిన శక్తిని నీవు ప్రదర్శించావు. ఇది దైవశక్తియేగాని మానవశక్తి కాదు", అని కీర్తించాడు. అందరూ వచ్చి రాముని గొప్పగా వర్ణించి, అతనికి పూలమాలలు వేయసాగారు. అప్పుడు జనకుడు సీతను తీసుకువచ్చాడు. రాముడు అటువైపు చూడనైనా చూడలేదు. ఎందుకంటే తల్లిదండ్రుల ఆజ్ఞ లేకుండా ఆమెను చూడకూడదని అతని ఉద్దేశం.



జనక మహారాజు అయోధ్యకు ఈ శుభవర్తమానం పంపించాడు. పెండ్లి ముహూర్తం నిర్ణయించి అందరూ రావలసిందిగా కోరాడు. మీ కుమారుడు నేను పెట్టిన పోటీలో విజయం సాధించాడు. కాబట్టి మీరందరూ సీతారాముల వివాహ మహోత్సవానికి సిద్ధమై రావాలి" అని కోరాడు. సీతారాముల కల్యాణానికి స్త్రీలందరూ ఆనందంతో పాటలు పాడుకుంటూ బయలుదేరారు.

**రారే చూడగ పోదాము రాముని పెండ్లి**
**రారే చూడగ పోదాము రమణులందరు కూడి**
**వింత బంగళాలు, ముత్యపు తోరణాలు**
**మూలల కిటికీలు, వజ్రాల తలుపూలు**
**తాపిన నీలాలు, నీలాలు వైయార్లు**
**నూర్వార్లు బజార్లు ॥రారే॥**

ఈవిధంగా ఒకవైపున స్త్రీలు తరలివస్తుంటే, మరొకవైపున పురుషులు పాడుకుంటూ వస్తున్నారు.

**కౌసల్యా తనయుని కల్యాణము చూతము రారండి!**
**అయోధ్యావాసుని కల్యాణము చూతము రారండి**
**చూచువారలకు చాలా పుణ్యమట**
**పుణ్యపురుషులకు ధన్య భాగ్యమట. ॥క॥**

అయోధ్య అంతా కదలి వచ్చింది అనిపించేటట్లు దశరథుడు, అతని రాణులు, భరత శత్రుఘ్నులు, మంత్రులు అందరూ ఆనందోత్సాహాలతో తరలి వచ్చారు. జనకుడు సకల రాజలాంఛనాలతో వారికి స్వాగతం పలికి గౌరవ మర్యాదలు చేశారు.

జనకుని రెండవ కుమార్తె ఊర్మిళ, ఆయన తమ్ముడికి మాండవి, శ్రుతకీర్తి అని ఇరువురు బిడ్డలు. ఊర్మిళను లక్ష్మణునికి, మాండవిని భరతునికి, శ్రుతకీర్తిని శత్రుఘ్నునికి ఇచ్చి వివాహం జరిపించాలని నిర్ణయించారు. 'నలుగురం ఒకేతూరి పుట్టాము. కాబట్టి నలుగురి వివాహాలు ఒకేసారి జరగాలి' అని రాముడు కోరాడు. అందరూ వారి వారి స్థానాలలో ఆసీనులయ్యారు. కల్యాణ మహోత్సవం ప్రారంభమైంది. రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు వారి ఎదుట వరుసగా సీత, ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తి నిలుచున్నారు. మొట్టమొదట సీత రాముని మెడలో మాల వేయాలి. రాముడు ఆజానుబాహుడు. సీత కొంచెం పొట్టి. రాముడు ఆమె ముందు తల వంచడం లేదు. ఎంత ప్రయత్నించినా సీతకు రాముని మెడలో మాల వేయడం సాధ్యం కావడం లేదు. అప్పుడు లక్ష్మణుడు ఒక యుక్తిని పన్నాడు తాను రాముని పాదాలకు సాష్టాంగ నమస్కారం చేశాడు. అతనిని లేవనెత్తడానికి రాముడు ముందుకు వంగేసరికి తక్షణమే సీత రాముని మెడలో మాల వేసింది. ఆతరువాత మిగిలిన ముగ్గురు పెళ్లికుమార్తెలు పెళ్లికుమారుల కంఠసీమలకు పూలమాలలతో అలంకరించారు. ప్రజలందరూ ఆనందంతో జయ జయ ధ్వానాలు చేశారు.

*(4వ పేజీ తరువాయి)*

మంత్ర తంత్ర యంత్ర నిగూఢ రహస్యాలు మామూలు మనుషులకి అంతుపట్టేవి కావు. అయితే, బీజయుతమైన మహామంత్రాలు అర్థాలు తెలియకపోయినా వ్యర్థం కావు. కేవలం మనన, పఠన, వుచ్చారణ, శ్రవణ మాత్రం చేత కామితార్థాలతో పాటు పరమార్థం కూడా ప్రసాదించే మహామంత్రాలు అసంఖ్యాకాలు. ఇక, శ్రీరామ తారక మంత్ర మహిమ గురించి వేరే చెప్పాలా?

శ్రీరామ మంత్రాలతో అత్యుత్కృష్టమైందీ క్రింది రామగాయత్రీ మంత్రం.

'ఓం దశరథాయ విద్మహే
సీతావల్లభాయ ధీమహి
తన్నోరామః ప్రచోదయాత్'

అనే రామగాయత్రీ మంత్రం ఐహికాముష్మికానంద ప్రదాయిని అని మహా మంత్రవేత్తల విశ్వాసం. సర్వకాల సర్వావస్థలలో సకల జీవరాసులూ జయమే కాంక్షిస్తాయి. అంచేత ఈ జయరామ మంత్రం...

'ఓం శ్రీరామ జయరాయ జయజయ రామ' అనే జయరామ మంత్రం లోకప్రసిద్ధమైంది.

**ఆపద్ధారక రామమంత్రం :**

**'ఓం ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదాం**
**లోకాభిరామం శ్రీరామం భుయో భుయో నమామ్యహం'**


అనే అపద్ధారక రామ మంత్రం అత్యంత శక్తిసమన్వితమైన మంత్రరాజాలలో ఒకటని రామభక్తాగ్రేసరుల విశ్వాసం.

**రామతారక మంత్రం:**

**'ఓం శ్రీరామాయ నమః'**

అనే అత్యంత సరళమైన మంత్రం మనో, వాక్, కాయాలనే త్రికరణాలని క్షాళించే మంత్రమని రామభక్తి తత్పరుల నమ్మకం.

ఇలా, సరళమైన, సంకీర్ణమైన బీజసంపుటీ యుక్తమైన శ్రీరామ మహామంత్ర రాజాలన్నీ లోకకల్యాణ ప్రదాలే.



# సద్గురువు

ఆయన నిజమైన సద్గురువు. రామాయణ, భారత, భాగవత ప్రవచనాలు చెప్పలేదు. ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఇవ్వలేదు. తాయెత్తులు కట్టలేదు.


మంత్రాలు వెయ్యలేదు. కాని అత్యంత హృద్యమైన రీతిలో ఏంత్రా పాలజీ, చరిత్ర, మానవ సంస్కృతి, ధర్మనిరతి, సంప్రదాయ ఔచిత్యం, జీవన సరళి – ఇన్నిటిని సమన్వయించి ఈ ఆధునిక ప్రపంచంలో ప్రతి వ్యక్తికీ అందే మార్గంలో సత్యాన్ని నిరూపించిన నిజమైన గురువు శివానందమూర్తి గారు. అపూర్వమైన అవగాహన, అనూహ్యమైన సమన్వయం, అత్యంత ఆశ్చర్యకరమైన నైర్మల్యం మూర్తీభవించిన గురువరేణ్యులు శివానందమూర్తి మహోదయులు.

ఎప్పుడు వారి సమక్షంలో కూర్చున్నా ఒక జీవితకాలం మననం చేసుకోవలసిన విజ్ఞాన సంపదను – మన దృష్టిని దాటిపోయే విలక్షణమైన కోణాన్ని ఆవిష్కరించే వారు. వారి ప్రత్యేకభాషణాన్ని రాసుకుని మరీ కాలమ్స్ రాసిన సందర్భాలున్నాయి. కొన్ని విషయాలను స్థాలీపులాక న్యాయంగా ఉటంకిస్తాను.

శైవం ఒక్క భారతదేశంలోనే కాదు – ఈజిప్టు, మెసపటేమియా, ఆఫ్రికా, మలేషియా వంటి ఎన్నో దేశాలలో ఉంది – అంటూ సోదాహరణంగా నిరూపించారు.

పరాశక్తి ఈశ్వరుని స్వభావం. కన్నుమూస్తే ఈశ్వరునే చూడాలి. కన్ను తెరిస్తే ధర్మాన్ని చూడాలి. మంచి భావాలే విద్య, ధర్మాన్ని ప్రాణంగా కలిగిన ఆచార వ్యవహారాలే మతం. శివానుగ్రహం నాకుందని తెలుస్తోంది. అది అరత కాదు. అనుగ్రహం. సత్యమంత రుచికరమైన వస్తువు ప్రపంచంలో మరొకటి లేదు.

ప్రపంచానికంతటికి పేదరికం అంటే దరిద్రం. కాని ఒక్క హైందవ జీవనంలోనే అది వైభవం. ఇక్కడ ప్రసక్తి 'లేమి' కాదు – 'అక్కర లేక పోవడం'.



అన్ని ప్రతిభలూ, ప్రజ్ఞా పాటాలూ, శక్తి సామర్థ్యాలూ, విజయాలూ – అన్నీ పర్యవసించే, పర్యవసించాల్సిన ఒకే ఒక్క గుణం – సంస్కారం (75 సంబరాల వయసున్న నన్ను శృంగేరీ స్వామికి ఒకే ఒక్క మాటతో పరిచయం చేశారు – 'సంస్కారి' అని!)

సంపద కూడబెట్టడానికి కాదు – వితరణ చెయ్యడానికి. అవసరం ఉన్న వాడికి ఇవ్వడానికి చేర్చి పెట్టుకున్నవాడు కేవలం కస్టోడియన్. (ఒకసారి భీమిలి ఆనందాశ్రమంలో నేను వారి సమక్షంలో కూర్చుని ఉండగా ఒక పేదవాడు వచ్చి తన కష్టమేదో చెప్పుకున్నాడు. శివానంద మూర్తి గారు లోపల్నుంచి మనిషిని పిలిచి 'ఇతనికి ఐదు వేలు ఇవ్వు' అని చెప్పారు.) ఈ సత్యాన్ని ఉర్లాం జమీందారీ కుటుంబంలో పుట్టిన ఆయన తన జమీందారీని వదిలి అతి సరళమయిన జీవికని ఎంచుకుని నిరూపించారు. ఉత్తర హిందూ దేశంలో గిరిజనుల పునరావాసాలకి ఎన్నో కార్యక్రమాలు చేశారు. ఎన్నో ప్రజాహిత ప్రణాళికలకు కార్యరూపం ఇచ్చారు. వారు నెలకొల్పిన ఆంధ్రా మ్యూజిక్ అకాడమీ, సనాతన హిందూ పరిషత్తు – ఎన్ని భారతీయ సంప్రదాయ వైభవాన్ని ఆవిష్కరించే కార్యక్రమాలు నిర్వహించిందో లెక్కలేదు.

ఆయన ముందు కూర్చుని, ఆయన మాట విని లేచాక భారతీయుడినైనందుకు, అంతటి సద్గురువుల నుంచి అన్ని సత్యాలను ఎరిగినందుకు వొళ్లు పులకిస్తుంది. గర్వపడాలనిపిస్తుంది. అది నా స్థాయి. కాని గర్వానికి, స్వోత్కరకీ ఆయన దూరం. ఏనాడూ 'నేను' అనే మాటని ఆయన నోటి వెంట వినలేదు. నా షష్టిపూర్తికి వారి ఆశీర్వాదాన్ని తీసుకోడానికి నేనూ, నా భార్య వెళ్ళాం. "రండి, నా పనిని తేలిక చేశారు" అంటూ రుద్రాక్ష, ముత్యాల బంగారు మాలని నా మెడలో వేసి 'దీన్ని ఎప్పుడూ తియ్యకండి" అంటూ మా ఇద్దరికీ బట్టలు పెట్టి దీవించారు.

ఈ సృష్టిలో అవినీతి, క్రౌర్యం, దుర్మార్గం, దౌష్ట్యం వంటి శక్తులు ప్రబలినప్పుడు సమాజగతిని సమతుల్యం చేయడానికి ఒక్క గొప్ప శక్తి అవసరమౌతుందన్నది భగవద్గీతకారుడి వాక్యం. ఎన్నో అరాచకాలు, రుగ్మతలు, దౌష్ట్యాల మధ్య ఒక్క మహానుభావుడి ఉనికి గొప్ప ఊరట. చలివేంద్రం, గొడుగు. గొప్ప శక్తుల, వ్యక్తుల సౌజన్యం ఇలాంటి దుష్టశక్తుల నుంచి విడుదల. అలాంటి గొప్ప శక్తి, స్ఫూర్తిని కోల్పోయిన దురదృష్టమైన క్షణం శివానందమూర్తి సద్గురువుల నిర్యాణం. ఎన్ని అవాంచిత పర్యవసానాలకో ఆయన సమక్షం ఒక గొప్ప సమాధానం. గొప్ప చేయూత. గొప్ప ధైర్యం. ఆ అదృష్టాన్ని ఈ తరం నష్టపోయింది.

**– గొల్లపూడి మారుతీరావు**




# చచ్చినట్టు బతికించే భాష!

తెలుగువాడికి సాటి ఇంకొకడు లేడు. అందరిదీ ఒక దారైతే మనవాడిది ఇంకోదారి! అందరూ పొగ పీలిస్తే తెలుగువాడు పొగ తాగుతాడు. ఇంతేకాదు తెలుగువాడు దెబ్బలు 'తింటాడు'. దెబ్బలు ఏమైనా తినే పదార్థాలా? అంటే ఉలకడు పలకడు.

సంస్కృతం అమరభాష అంటారు. దాని సంగతేమో కానీ తెలుగు మాత్రం కచ్చితంగా అమరభాషే! ఇందుకు ఉదాహరణలు ఉన్నాయి. ఎవరి మీద అయినా ప్రేమ వచ్చినా, కోపమొచ్చినా 'సచ్చినోడా' అని తెలుగువాడు పిలుస్తాడు. 'సచ్చినోడు' ఎలా పలుకుతాడని ఆలోచించడు. చచ్చినా ఒప్పుకోను అంటాడు. చస్తే ఎలా ఒప్పుకుంటాడు? చచ్చినాక ఒప్పుకుని చూపించిన వాడు ఒక్కడైనా ఉన్నాడా? ఆశ చావడం లేదంటాడు. చెట్లకే ప్రాణం ఉందని చెప్పుకుని చావనివాళ్లు ఇంకా ఉన్నారు. అలాంటి వాళ్లు ఆశకు ప్రాణం ఉంటుందని ఎలా ఒప్పుకుని 'చస్తా'రు? తెలుగువాడు కంటి చూపుతో చంపేస్తాడు. అతడి శక్తి అలాంటిది. ఇలాంటి అతీత శక్తులు యావత్ ప్రపంచంలో తెలుగువాడికి మాత్రమే ఉన్నాయి. ఎంత గొప్ప! ఎంత చిత్రం!

మత్తు పానీయాలైన సారా, బ్రాందీ, విస్కీలను 'సేవిస్తున్నా'నంటాడు. అదే సమయంలో మంచినీళ్లు తాగుతున్నానంటాడు తప్ప సేవిస్తున్నాననడు. ఇదేం చిత్రమో! ఇంకా చిత్రమేంటంటే మందు 'కొడుతున్నా'నంటాడు. కొట్టడానికి మందేమన్నా మనిషా? పశువా? బాతాఖానీ కొట్టకు అంటాడు. దీని పరిస్థితీ ఇదే. అనారోగ్యకరమైన నిషా పానీయాన్ని ఆరోగ్యప్రదాయిని అయిన మందు పేరుతో పిలుస్తాడు! అంతా 'మందే' అనుకునేవాడు తప్ప ఇంకెవ్వడైనా ఈ పని చేయగలడా? తెలుగువాడు ఎందులోనైనా ఆటను చూడగలడు. మాట్లాడతానంటాడు. పోట్లాడతానంటాడు. మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానంటాడు. మనసు పూర్తిగా కాకుండా అందులో ఏభై శాతమో, డెబ్భైఅయిదు శాతమో ఉంచి కోరుకుంటాడా ఏంటి? ఇంకోమాట! హృదయపూర్వకంగా అభినందిస్తున్నానంటాడు. కాసేపు హృదయాన్ని పక్కనబెడితే, అభినందించే అవకాశం ఉందా? ఉంటుందా?

తెలుగువాడి 'న్యాయమే' వేరు. బడాయి గానీ మాట మాట్లాడితే 'మనస్సాక్షిగా' అంటాడు. మనసుకు ఏమన్నా రూపం ఉందా? మాట ఉందా? వచ్చి సాక్ష్యం చెప్పడానికి! అగ్నిసాక్షిగా పెళ్లాడాను అని కూడా అంటాడు. అగ్ని ఏదో చిటపటలాడుతుంది కానీ ఎవరైనా సంసారంలో చిచ్చుపెడితే అదొచ్చి అడ్డుపడుతుందా ఏంటి? కళ్లలో నిప్పులు పోసుకుంటున్నాడంటాడు! పోసుకోమనండి చూద్దాం! పెళ్లికాని ఆడపిల్లను గుండెల మీద కుంపటి అంటాడు. ఇది ఎంత తప్పు! గుండెల మీద కుంపటి పెట్టుకున్న మొనగాళ్లు యావత్ భూప్రపంచంలో ఎవరైనా ఉన్నారా? మాటేగా ఏదైనా అంటాడు. గుండె మీద బరువు తగ్గించుకున్నానంటాడు. గుండెల మీద బట్టల బరువు తప్ప ఇంకేం బరువు ఉంటుంది! నవ్వితే నవరత్నాలు రాలతాయంటాడు. రత్నాలా పాడా? మరీ గట్టిగా నవ్వితే పళ్లు రాలిపోతాయేమో! చిటికెలో పని అయిపోతుందంటాడు. అతిశయం కాకపోతే చిటికె వేస్తే శబ్దం అవుతుంది కానీ పని ఎలా అవుతుంది!

ఒట్టిమాటలు కట్టిపెట్టోయ్ అని గురజాడ చెప్పినా మనవాళ్లు వినరు. అప్పు తీసుకునేటప్పుడు 'నీ డబ్బు వడ్డీతో సహా పువ్వుల్లో పెట్టి ఇస్తా'నంటారు. వడ్డీ ఇస్తే ఇవ్వచ్చుగానీ పువ్వుల్లో పెట్టి ఇచ్చినవాడు ఎవడైనా ఉన్నాడా? ఇది అప్పిచ్చిన పిచ్చివాడి చెవిలో పువ్వు పెట్టడం కాదూ! ఎవరో చిన్నచూపు చూస్తున్నారని తెలుగువాడు ఆక్షేపిస్తాడు. దూరపు చూపు, దగ్గరి చూపు ఉంటాయి తప్ప చిన్న చూపు, పెద్ద చూపు అని ఎక్కడైనా ఉంటాయా? వంట చేయడాన్ని చేయి కాల్చుకోవడం అంటాడు. ఇదే నిజమైతే ఆడవాళ్ల చేతులన్నీ ఏమైపోయేవి!

సంగీతమంటే చెవికోసుకుంటానని ఒక్కొక్కరు వంకర్లు తిరిగిపోతుంటారు. అయితే అతడు ఎంతసేపు పాటలు వింటున్నా కోసుకున్న చెవి కిందపడదే అని నిరాశ పడ్డవాళ్లూ ఉన్నారు. తప్పు చేసినవాడు అడ్డంగా దొరికిపోయాడు అంటారు. దొరికినవాడెవడైనా అడ్డంగా దొరుకుతాడా? నిలువుగా దొరుకుతాడు తప్ప. అన్నట్టు గిట్టనివాణ్ని అడ్డమైనవాడు అని తిడతారు. అదేంటి? దాని భావ మేంటి? పండితార్థం ఏమైనా పిండితార్థం ఒకటుంది. పశువా అని తిట్టినట్టు. మనుషులు నిలువుగా ఉంటారు. పశువులు అడ్డంగా ఉంటాయి. అదీ సంగతి! ఎవడి మీదైనా కోపం వస్తే ఏ మొహం పెట్టుకుని వచ్చావంటాడు తెలుగువాడు. ఎవడికైనా ఒకటే ముఖం ఉంటుంది కానీ బ్రహ్మలాగా నాలుగు ముఖాలు, రావణబ్రహ్మలాగా పది ముఖాలు ఉండవు కదా! ఫలానావాడు తలలు మార్చేరకం అనేది కూడా తెలుగువాడి వాడుక. ఇదెలా సాధ్యం? వినాయక వృత్తాంతంలోలాగా తలలు మార్చేశక్తి సామాన్య మానవులకు ఉంటుందా?

తెలుగువాడు బండ చాకిరీ చేస్తానంటాడు. బండ దాని మొహం! ఎక్కడ పడేస్తే అక్కడే ఉంటుంది కానీ అది చేసే చాకిరీ ఏముంటుంది? ఏముంది ఎడమ చేత్తో చేస్తానంటాడు. ఎడమ చేత్తో చేసే పనులేంటో అందరికీ తెలుసు. దానితో అన్ని పనులూ అతివేగంగా చేస్తానంటే ఎలా కుదురుతుంది? అన్నం ఉడకలేదా అంటాడు. ఇదేంటి? ఉడికితే కానీ అన్నం కాదు కదా! జోకులు పేల్లేదు అంటాడు. జోకు ఏమైనా బాంబా? పేలడానికి! వీపు విమానం మోత మోగుతుందని అంటాడు. విమానం మోత మోగితే ఆ వీపు అసలు ఉంటుందా? మనిషి అసలు ఉంటాడా? లేస్తే మనిషిని కానంటాడొకడు. మరి లేచినవాళ్లందరూ ఏంటి? అలాంటప్పుడు కూర్చుని ఉంటేనే మేలు కదా! శక్తిని కూడా భక్తికి ముడి పెట్టడం తెలుగువాడికి రివాజు. ఉన్న పూజలు చాలక బడితెపూజ ఒకటి.

జంతువుల్లో కూడా దేవుళ్లను చూసుకుని భారతీయులు ఆరాధిస్తారు. ఇందుకు తెలుగువాడు కూడా మినహాయింపు కాదు. ఎటొచ్చీ మనుషుల్లో జంతువుల్ని చూడటం అతగాడి ప్రత్యేకత. గిట్టనివాళ్లను పంది, కుక్క, గాడిద అని తిట్టే తెలుగువాడు, ఇష్టమైనవాణ్ని పులి, సింహం, గుర్రం అని అభిమానంగా చూస్తాడు. పిలుస్తాడు.

ఏదైనా కళ్లారా చూస్తే తప్ప నమ్మకూడదు. తెలుగు భాష ఇందుకు ఇంపు అయిన మినహాయింపు. గుండె జారిపోయింది అంటారు. ఇప్పటివరకు ఎవరికైనా జారిపోయిందా? లేదే! నీ నోరు పడిపోను అని తిట్టిపోస్తారు. ఎవరి నోరు అయినా ఎప్పుడైనా పడిపోవడం చూశామా? పాడమని అడిగితే గాయకులు గొంతుపోయింది అంటారు. గొంతు ఎక్కడికి పోతుంది? పోతే ఎవరు తీసుకురాగలరు? నోరు పారేసుకోవడం అంటారు. అది ఎలా సాధ్యం? మా ఆయనకు నోట్లో నాలుకలేదని ఓ ఇల్లాలు వాపోతుంటుంది. నోట్లో నాలుక లేకుండా మనిషి ఎలా ఉంటాడు? 'వాసన చూడు' అంటారు. వాసనను పీలుస్తారు కానీ ఎలా చూస్తాం? రుచి చూడటం కూడా అంతే. ఎవరు చూడగలరు?

పత్రికలు చదివి చదివి వాటిలోని పడికట్టు మాటలను కంఠస్థం చేసేశాడు తెలుగువాడు. ఫలానావాడు బాధకు గురయ్యాడు అంటాడు. మధ్యలో గురి ఎందుకు? బాధపడ్డాడు అనొచ్చుగా. దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడంటారు. దిగ్భ్రాంతి చెందాడు అనడు. దిగ్భ్రాంతిని ఎలా వ్యక్తం చేస్తాడంటే చెప్పడు. తప్పు చేస్తే పాపం అంటాడు సరే. ఎదుటివాడు కష్టాల్లో ఉంటే అయ్యో 'పాపం'! అంటాడు. తెలుగు భాష ఏమన్నా పుణ్యానికి వచ్చిందా ఏంటి?

'దేశ భాషలందు తెలుగు లెస్స' అని శ్రీకృష్ణ దేవరాయలు చెప్పాడని గొప్పగా చెబుతాం. ఇంగ్లీషు మాటలు తెలుగులో కలవని రోజుల్లో అన్న మాటలివి. తెలుగంతా ఇంగ్లీషు మయం అయిన ఈ రోజుల్లో అయితే 'ప్రపంచ భాషలందు తెలుగు లెస్స' అనక తప్పదు.

తమిళుడు తన భాషలో మాట్లాడుతుంటే తమిళుడికి తప్ప ఇంకొకరికి అర్థం కాదు. బెంగాలీ తన భాషలో మాట్లాడుతుంటే బెంగాలీకి తప్ప ఇంకొకరికి అర్థం కాదు. తెలుగు తప్ప భారతీయ భాషలన్నీ అంతే. మరి తెలుగువాడో.. తెలుగు అని చెప్పి మాట్లాడుతుంటే అన్ని భాషలవాళ్లకూ ఎంతో కొంత అర్థమవుతుంది. ఇందుకు ఇంగ్లీషు, ఉర్దు, తమిళం, కన్నడం, హిందీ లాంటి సమస్త భాషలూ ఇందులో 'గూడు' కట్టుకునో భవనం కట్టుకునో ఉంటాయి. ఇంగ్లీషు మాత్రం ఇంతకన్నా పొడిచిందేముంది? ఇది తెలుగువాడి వ్యూహం. అందువల్ల తెలుగు మనుగడకు ఎట్టి పరిస్థితిలో ఢోకా రాదు. తెలుగు భాషా జిందాబాద్! ●


**SRI RAJARAJESWARI JEWELLERY**

**The Oldest Jewellery Shop in Pondy Bazaar**

**81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.**

**Phones : 28152387, 28154653**

***The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation***



# సుందరకాండ పారాయణతో అద్భుత ఫలితాలు!!

రామాయణం గొప్ప గ్రంథం. అందులో మొత్తం ఏడు కాండలు ఉన్నాయి. ఆ ఏడు ఆ సందర్భాలకు అనుసరించి పేర్లు పెట్టబడ్డాయి. కానీ ఆ ఏడింటిలో విశిష్ట మైనది సుందరకాండ. ఆంజనేయుడు సముద్రాన్ని దాటి లంకను చేరుకుని, సీతను వెతికి, కనుక్కుని తరువాత లంకను దహనం చేసి, సీత ఎక్కడుంది అనే విషయాన్ని రాముడికి తెలియజెప్పడం ఈ సుందరకాండ సారాంశం. రామాయణం అంతా రాముడి గురించి అయితే, సుందరకాండ ఆంజనేయుడి అద్భుత విన్యాసాన్ని కళ్ళ ముందు ఉంచుతుంది. అందుకే సుందరకాండకు అంత ప్రత్యేకత. అయితే సుందర కాండ పారాయణ వల్ల జీవితంలో ఎన్నో సమస్యలు తొలగిపోతాయని అందరి నమ్మకం.

సుందరకాండలో ఏది చదివితే ఏ సమస్య తీరిపోతుందని కూడా పండితులు వివరించారు. సుందరకాండలో ప్రతిపదం, ప్రతి శ్లోకం, మంత్రబద్ధమై ఉంటుంది. అంతే కాదు అదంతా చందస్సులో కూర్చబడి ఉంటుంది. సుందరకాండను భక్తితో చదివినా, విన్నా, నిత్యం పారాయణం చేసినా, ప్రవచించినా, బాధలు కష్టాలు తొలగిపోతాయి. రోగాలు నయమౌతాయి, భయాలు పోతాయి, మనశ్శాంతి కలుగుతుంది. మృత్యు భయం పోతుంది.

లంకా విజయం చదివితే భూత-ప్రేతాదుల భయంతో ఉన్నవాళ్లను హనుమంతుడు రక్షిస్తాడు.

హనుమ నిర్వేదం చదివితే బుద్ధిమాంద్యం సమస్యలున్నవారికి ఆ సమస్య తొలగుతుంది.

లంకలో సీతాన్వేషణ ఘట్టం చదివితే ఇతరులు వల్ల మనపై కలిగే దోషాలు తొలగిపోతాయి.

లంకలో సీతమ్మను హనుమ చూసిన ఘట్టం చదివితే ఐశ్వర్యం సిద్ధిస్తుంది.

త్రిజటా స్వప్న వృత్తాంతం చదివితే చెడ్డ కలల వల్ల కలిగే దోషాలు పోతాయి.

సీతారావణ సంవాదం చదివితే మంచి బుద్ధి కలుగుతుంది.

సీతా హనుమ సంవాదం చదివితే దూరమైపోయిన బంధువులు తిరిగి కలుస్తారు.

అంగులీయక ప్రదానం చదివితే కష్టాలు తగ్గుతాయి.

కాకానుగ్రహం చదివితే తెలిసీ తెలియక ఎప్పుడైనా రాముడి విషయంలో ఏదైనా తప్పు చేసి ఉంటే అవి తొలగిపోతాయి.

చూడామణి ప్రదానం చదివితే బ్రహ్మజ్ఞానం కలుగుతుంది.

కిమ్కరాది రాక్షసులను హనుమ వధించిన ఘట్టాలు చదివితే శత్రువుల మీద విజయం సాధిస్తారు.

లంకాదహన ఘట్టం చదివితే ఇంట్లోనూ, వ్యవసాయ పనుల్లో అభివృద్ధి కలుగుతుంది.

మధువన ధ్వంసం చదివితే ఆ పుణ్యం వల్ల మరణం తరువాత బ్రహ్మలోకానికి వెళతారు.

సీతా సందేశాన్ని రాముడికి నివేదించడం చదివితే అనుకున్న పనులు అన్నీ నెరవేరుతాయి.

68 రోజుల పారాయణం చేస్తే కొడుకులు పుట్టలేదని బాధపడేవారికి కొడుకులు పుడతారు. అలాగే పెళ్లికాని ఆడపిల్లల పెళ్లి తొందరగా జరుగుతుంది.

రోజూ సుందరకాండ పారాయణం చేస్తూ ఉంటే వర్షాలు చక్కగా కురిసి, పంటలు పండి, కరువు మాయమవుతుంది.

అంగులీయక ప్రదానం చదివితే తలపెట్టిన పనులలో విజయం సొంతం అవుతుంది.

బ్రహ్మాస్త్ర బంధం నుండి విముక్తి, హనుమద్గ్రహణం చదివితే శనిబాధలు ఉన్నవారికి ఆ సమస్యల నుండి ఉపశమనం దొరుకుతుంది.

నిత్య పారాయణం చేస్తే అన్ని పనులలో విజయం కలుగుతుంది, అలాగే అన్ని విధాలుగా శుభం కలుగుతుంది.

సుందరకాండ చదివేచోట రాముడు ఎల్లప్పుడూ ఉంటాడు, అలాగే రాముడి గురించి పూజలు జరిగేచోట హనుమంతుడు ఉంటాడు. కాబట్టి సుందరకాండ పారాయణ చేయగానే ఆవు పాలు బాగా కాచి గోరువెచ్చగా ఉన్న పాలలో చక్కెర కలిపి నైవేద్యంగా పెట్టాలి. ఇది ఎంతో గొప్ప నైవేద్యం. ఇలా చేస్తుంటే సకల సమస్యలు తొలగిపోతాయి. ●



*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :



Beautiful City - Beautiful Hotel




Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

# బ్రహ్మ రాత



ఒకసారి నారదుడు భూలోకంలో సంచరిస్తుంటే, ఆయనకు ఒక సముద్ర తీర ప్రాంతంలో ఒక పుర్రె కాలికి తగిలిందట. దాని 'తలరాత' ఆ పుర్రె మీద ఇంకా అలాగే నిలిచి ఉందని చూసి నారదుడు కుతూహలంతో ఆ పుర్రెను చేతిలోకి తీసుకొని ఆ రాతను చదివాడట. పొడి పొడి మాటలలో, 'జన్మ ప్రభృతి దారిద్ర్యం, దశ వర్షాణి బంధనం, సముద్ర తీరే మరణం, కించిత్ భోగం భవిష్యతి' (పుట్టుక నుంచి దరిద్రం, మధ్యలో పదేళ్లు కారాగార వాసం, చివరికి సముద్ర తీరంలో చావు, కొంచెం భోగం కలుగుతుంది) అని ఉంది....

నారదుడికి ఆశ్చర్యం వేసింది.... 'జన్మంతా దరిద్రం, మధ్యలో కారా గార వాసం, చివరికి అయిన వాళ్లు ఎవరూ దగ్గర లేకుండా ఎక్కడో సముద్ర తీరంలో చావు అని రాసి పెట్టి ఉండగా, ఇక ఆపైన భోగం ఏమిటి? మా నాన్నగారు పొరబడ్డారా?' అనుకొని సరాసరి బ్రహ్మలోకానికి వెళ్లి తండ్రిని ప్రశ్నించాడు....

'ఇతగాడు నిష్ఠ దరిద్రుడే... దిక్కులేకుండా మరణించిన మాటా నిజమే....

కానీ నీలాంటి దేవర్షి తన స్వహస్తాలతో ఇతని కపాలాన్ని ఎత్తి, మోసుకొంటూ సాక్షాత్తూ బ్రహ్మలోకం దాకా చేర్చాడంటే, కొద్దిపాటి మహాభాగ్యం లభించినట్టు కాదంటావా?" అన్నాడట బ్రహ్మ!!!!!!

బ్రహ్మ రాత పొల్లు పోనిదనీ, దాన్ని ఎవరూ తప్పించుకోలేరనీ భారతీయ సంప్రదాయంలో అనాదిగా ఓ నమ్మకం....

'యత్ ధాత్రా నిజ పాల పట్ట లిఖితం, స్తోకం మహత్ వా ధనం తత్ ప్రాప్నోతి మరుస్థ లేపి నితరాం మేరౌ చ న అతోధికమ్' (విధాత, మనిషి ఫాల తలం మీద ఎంత రాశాడో అంత ధనం, అది కొంచెమైనా అధికమైనా, ఆ మనిషికి ఎడారిలో ఉన్నా లభిస్తుంది.... సువర్ణమయమైన మేరు పర్వతం ఎక్కినా అంతకంటే ఎక్కువ లభించదు) అని చెప్పాడు భర్తృహరి.....

మరి అంతా బ్రహ్మ రాతే అయితే ఇక మనిషి కర్మలకీ, ప్రయత్నాలకీ ఏ విలువా లేనట్టేనా? బోలెడంత ఉంది....

ఈ ప్రపంచంలో ప్రతి కర్మకూ దానికి తగిన ఫలం ఉండి తీరుతుంది అని కదా కర్మ సిద్ధాంతం? అంటే పాపానికి ఫలంగా దుఃఖం, పుణ్యానికి ఫలంగా సుఖం అనుభవించాల్సిందే....

బ్రహ్మరాత అంటే ప్రాణి ఈ జన్మలో అనుభవించబోతున్న పూర్వ జన్మ కర్మల ఫల శేషమే....

దీనినే మరో విధంగా చెప్పుకోవాలంటే, మనిషి కర్మ ఫలాల శేషం ఎప్పటికప్పుడు అతని ఖాతాలో జమగానో, అప్పుగానో భద్రంగా నిలువ ఉంటుంది....

మనిషి పుట్టినదే ఆ నిల్వను వాడుకొనేందుకు, లేదా ఆ ఋణం తీర్చుకొని వెళ్లేందుకు....

బ్రహ్మ రాత అంటే ఈ కర్మఫల శేషం తాలూకు పద్దు అని మాత్రమే.....

ఇది బ్రహ్మ తన ఇచ్ఛానుసారం రాసేది కాదు....

మనిషి ప్రతి జన్మలో చేసుకొనే పాప పుణ్య కర్మల బాధ్యత అతనిదే....

బ్రహ్మ రాత చెరపలేనిదీ, అనుభవించక తప్పనిదీ, తప్పించుకోటానికి వీలులేనిదీ అన్న మాటకు అర్థం కర్మ ఫలం అనుభవించక తప్పదు అని మాత్రమే....

– బ్రహ్మశ్రీ వెల్లంకి కృష్ణ శర్మ


# ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్థన!

ప్రముఖాంధ్ర గత 28 సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? 'వేలు'గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.

అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతూంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినెలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో – మేమూ అలానే మీ ప్రతీ 'రూక'నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. 'ప్రముఖాంధ్ర'ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న డబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.

**రూ. 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా**

ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :

| | | |
|---|---|---|
| Account Name | : | PRAMUKHANDHRA |
| Account No | : | 20011102592 |
| Bank | : | BANK OF MAHARASTRA, T.NAGAR |
| IFSC Code | : | MAHB 0000450 |

**ప్రముఖాంధ్ర**

64, తంబయ్యరెడ్డి వీధి, వెస్ట్‌మాంబళం, చెన్నై – 33.

మొబైల్ : 98400 48941

# పరమార్థ కథలు




## శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు

**శ్రీశుకబ్రహ్మాశ్రమము, శ్రీకాళహస్తి**

## జ్ఞానోదయము

పూర్వకాలమున ఒకానొక పట్టణమున ఒక ధనికుడుండెడివాడు. అతడు వ్యాపారముద్వారా లక్షలకొలది ఆస్తిని సంపాదించెను. ఒకనాడతని కొక సంకల్పము జనించెను. అది యేదనగా –"ఈ ప్రపంచమున ఎందఱో చక్కని గృహములను, సౌధములను నిర్మించుకొని కాపుర ముండుచున్నారు. నాకు పరమాత్మ కోట్లకొలది ధనమును ప్రసాదించినాడు. అట్టిచో ఈ చిన్న గృహమునందే నాజీవితమును గడుపనేల? బ్రహ్మాండమైన ప్రాసాదమును, రాజభవనమును ఏల నిర్మించుకొని కాపుర ముండరాదు? కావున ఎన్ని లక్షలద్రవ్యము నైనను ఖర్చుపెట్టి ఇంతవఱకు కని విని ఎఱుగనట్టి, అపూర్వభవనమును నిర్మించుకొని అందు నివసించెదను" అని ఈ ప్రకారముగ ఆ ధనికుడు గొప్పగొప్ప మేస్త్రీలను వేలకొలది కార్మికులను నియోగించి రెండు సంవత్సరములలో రమణీయమగు హర్మ్య మొకదానిని నిర్మింపజేసెను.

ఆ ప్రాసాదము అత్యంత మనోహరముగ నున్నదై రాజభవనములను గూడ మఱిపింప జేయుచుండెను. పది అంతస్తులు గల బ్రహ్మాండమైన సౌధమది, ప్రతి అంతస్తునందును నవీనపద్ధతులతో ఏర్పాటు చేయబడిన చిత్ర విచిత్ర పరికరము లెన్నియో అమర్చబడి కనుల పండువుగా నుండెను. ముఖ్యముగా అన్నిటికంటె పైనున్న అంతస్తు ప్రత్యేక అలంకారములతో గూడినదై, స్నానపానాది సమస్త సౌకర్యములతో గూడి, చూచుటకు ముచ్చట గొలుపుచుండెను. ధనికుడు క్రింద నున్న తొమ్మిది అంతస్తులను అద్దెకిచ్చి తాను మాత్రము కుటుంబముతో సహా పదవ అంతస్తునందు కాపురముండుచుండెను. కనుకనే అద్దానిని ఎంతయో మనోహరముగ తీర్చిదిద్దెను. ఆ భవనము, అందును ముఖ్యముగ ధనికుడు స్వయముగ వసించు పదవ అంతస్తు చూపరులకు దిగ్భ్రమ గొలుపుచు మయుని సృష్టిని జ్ఞాపకమునకు దెచ్చుచుండెను.

ధనికుడు తాను నిర్మించిన గృహమును జూచి మురిసి పోవుచుండెను. ఆ పట్టణమునకు పెద్దలెవరు విచ్చేసినను వారిని తన గృహమునకు తీసికొనివచ్చి అంతయు చూపించి పంపుచుండెను. ఒక విజిటర్స్ బుక్ (Visitors Book) ఏర్పాటుచేసి తన భవనమును గూర్చి ఇతరులచే వారి అభిప్రాయములను అందు లిఖింపజేయుచుండెను. ప్రతివారును తామిట్టి సర్వాంగ సుందరభవనము నింతవఱ కెచటను కని విని యుండలేదనియు, ఇది లోకోత్తర సుందర భవనమనియు అందువ్రాసి వెళ్ళుచుండిరి. వారి యాఅభిప్రాయములను తిలకించి ధనికుడు పరమానంద భరితు డగుచుండెను.

ఇట్లుండ ఒకనా డాపట్టణమున కొక సాధువు విచ్చేసెను. ధనికుడు ఆ సాధువుగారిని తన యింటికి ఆహ్వానించి భిక్ష ఏర్పాటు చేసి, భోజనానంతరము తన గృహమంతయు ఆతనికి చూపెను. క్రిందనున్న తొమ్మిది అంతస్తులను ముందుగా చూపి తుదకు తాను స్వయముగ నివసించుచున్న పదవఅంతస్తునకు సాధువుగారిని తీసికొని వెళ్లి అచటగల ప్రతివస్తువును వివరించి చెప్పుచు అంతయు చూపెట్టెను. సాధువుగారు అచటచట గల ఆధునిక సౌకర్యములను, మిరుమిట్లు గొలుపు చిత్రవిచిత్ర వస్తుసామాగ్రిని, అలంకారములను జూచి పరమాశ్చర్యము నొందెను. ఈ ప్రకారముగ అంతయు చూపించిన పిదప ధనికుడు – మహాత్మా! ఈ గృహమును గూర్చి మీయభిప్రాయమును తెలియజేయుడని కోరగా, అంతట సాధువుగారిట్లు వచించిరి. 'ఓయీ! ఇట్టి దివ్యభవనమును నేనింతవఱకెచటను చూచి యుండలేదు. ఇది అపూర్వముగ నున్నదై చూపరులకు మహోల్లాసమును గలుగజేయుచున్నదనుటలో ఏలాంటి సందియమును లేదు. అయితే ఒక్క విషయమున మాత్రము నాకు చాలదిగులు కలుగుచున్నది. ఈ మిద్దెపై మీరు చనిపోయినపుడు మిమ్ములను దింపుట కష్టము. మీ శవమును పదిఅంతస్తులనుండి దింపవలెనన్న చాల కష్టము!'

ఆ వాక్యములను వినగనే ధనికుని గుండె బ్రద్దలయ్యెను. భవిష్యత్తులో తనకు మృత్యువు సంభవించుననిగాని, అపుడు తనకును తన భవనమునకును ఎడబాటు కలుగునని అతడు కలలోనైన ఊహించలేదు. తాను, తన భవనము శాశ్వతమని తలంచి దానిని గాంచి మైమరచి పోవుచుండెను. అట్టి సమయమున సాధువుగారు ధనికునకు కనువిప్పు కలిగించెను. భవిష్యత్తులో జరుగబోవు ఒక మహా ప్రమాదము నాతనికి గుర్తునకు వచ్చెను. అదియే మృత్యువు. దానిని మఱచి జనులు భోగ విలాసములలో మునిగి, ప్రాపంచిక వ్యవహారములలో నిమగ్నులై, నామరూప జగత్తు సత్యమని నమ్మి విషయముల వెంట పరుగిడుచు తమ సౌందర్యము, తమకీర్తి తమ అధికారము తమ ప్రతిష్ఠ, తమ గృహారామాదులు చూచి మురిసిపోవుచున్నారు. సాధువు వచించిన వాక్యముద్వారా ధనవంతునకు ప్రపంచవస్తు

స్వరూపము దృగ్గోచర మయ్యెను. బాహ్యవస్తువుల క్షణికత్వము అనుభూత మయ్యెను. ఆతనికి జ్ఞానోదయము కలిగెను. అప్పటి నుండియు అతడు తన భవనముపై గాని, ఇతర వస్తువుల పైగాని మమత్వ ముంచక, అట్టి క్షణిక వస్తు జాలముపై విరక్తి గలిగి శాశ్వతమగు పరమాత్మనే ఆశ్రయించి, జప, ధ్యానపరాయ ణుడై జీవితమును సద్వినియోగ పఱచుకొనెను.

జనులు తమ సంపదలను, వైభవములను జూచి విఱ్ఱవీగరాదు.

**'మా కురు ధన జన యౌవనగర్వం**
**హరతి నిమేషాత్కాలస్సర్వం'**

అను శంకర భగవత్పాదుల వాక్యానుసారము అవి యన్నియు కాలగర్భమున అంతరించిపోవును. గోవిందు డొకడే శాశ్వతుడు. కావున ఆ పరమాత్మనే భజించ వలెను (భజగోవిందం). ఆతనినే ఆశ్రయించ వలెను. బాహ్యవస్తువులన్నియు, తుదకు దేహముకూడ కాలక్రమమున నశించిపోవునను పరమసత్యమును ఏ కాలమందును మఱువరాదు, ఈ ప్రకార మెఱింగి వ్యవహార మాచరించుచున్నప్పటికి దేనియందును తగుల్కొనక, భగవంతుని ఆశ్రయించి కాలము గడుపువాడు ధన్యుడు, అట్టివాడు బాహ్యవస్తువులపై మమత్వ ముంచక తన హృదయస్థ పరమాత్మను ఈ జీవితమందే సాక్షాత్కరించుకొని కృతార్థుడు కాగలడు. అట్టి ఆత్మసాక్షాత్కారమే జీవితపరమార్థమని సర్వులు గుర్తెరిగి అద్దానిని యత్నపూర్వకముగ బడసి ధన్యులు కావలయును.

**నీతి:– ప్రాపంచిక వైభవములు అశాశ్వతములు. వానిని చూచి మురిసిపోరాదు. తాను చేసిన పుణ్యమే, తాను పొందిన ఆత్మజ్ఞానమే తనను రక్షించును.** ●



# శుభకృత్ నామ సంవత్సరములో శుభములు జరగాలని కోరుకుందాం

గత రెండున్నర సంవత్సరములగా ప్రపంచం అతలాకుతలమైపోయింది. ప్రజలు నానాఇబ్బందులు పడ్డారు. చాలా పెద్దవారు పేరెన్నికగన్నవారు ఎవరికి తెలియకుండానే వెళ్ళిపోయారు (మరణించారు). వ్యాపారులు నష్టాలు ఊబిలో కూరుకుపోయారు. బ్రతికుంటే చాలు బాబోయ్ అనే దుస్థితికి చేరుకున్నారు. కొన్ని లక్షల ప్రాణాలు ఈ కొరోనా బారినపడిపోయారు. మొత్తం ప్రపంచం విస్తుపోయింది. ఈ 2022 ఆంగ్ల నామ సంవత్సరంలో గత రెండేళ్ళు కన్న ప్రాణనష్టం తక్కువని చెప్పాలి. కొరోనా మూడవ వేరియంట్ కాస్త నెమ్మదించింది అనిపించింది. ఈ ఏప్రియల్ 2న శుభకృత్ నామ సంవత్సరం పేరుకు తగ్గట్టు శుభాలని కలిగిస్తుందని ఆశిస్తున్నాము. శుభాలను కలిగించమని ఆ భగవంతుణ్ణి కోరుకుందాం. త్రికరణ శుద్ధిగా ప్రార్థిద్ధాం. ఇక మేము ఈ బాధలను తట్టుకోలేమని చెబుదాం. పిల్లలకు విద్యాలయాలు మూసివేయడంతో ఈ ఆన్‌లైన్ క్లాసులు అర్థమయ్యి కొందరు అర్థమవ్వక కొందరు అవస్థలు పడ్డారు. పరీక్షలనేవీ లేవు. ఆల్ పాస్. అసలే రిజర్వేషన్ల గొడవ, పైగా ఆల్‌పాస్. బాగా చదువుకునే విద్యార్థులు ఏమి చెయ్యాలో తోచలేని స్థితి. అమ్మా శుభకృత్ నామ సంవత్సరం, మమ్ము రక్షించు తల్లి, కాపాడు తల్లి అంటూ ప్రార్థిద్దాం.



ఇప్పటికి సృష్టి జరిగి నాలుగు లక్షల ఇరవై ఆరు వేల ఎనిమిది వందల ఎనభైతొమ్మిది సంవత్సరాలయింది. ఈ కలియుగము ఇంకనూ ప్రధమ పాదములోనే ఉన్నది. (2012 సం॥ములో ప్రళయం జరుగుతున్నది, విలయము జరుగుతున్నవనేది. కల్పిత మాటలు, అర్థములేని కూతలు).

వసంత కాలమున ప్రకృతి నవచైతన్యము కలిగిన చైత్రశుద్ధ పాడ్యమిని నూతన వత్సరమగునని ప్రఖ్యాత జ్యోతిష శాస్త్రవేత్త వరాహమిహిరుడు క్రీస్తు శకము నాలుగవ శతాబ్దములోనే నిర్ణయించినాడు.

మన ప్రాచీన ఋషులు, జ్యోతిష్య శాస్త్రవేత్తలెల్లరూ దీర్ఘదర్శులూ, దూరదర్శులూ 'ఉగస్య ఆది: ఉగాది' అన్నది భారత శాస్త్రవేత్తల అభిప్రాయం.

వారు తమ దీర్ఘదృష్టితో ప్రపంచ కాల ఆవిర్భావమును గుర్తించి, 17,28,000 సంబబముల కృతయుగం, 12,96000 సంవత్సరముల త్రేతాయుగం, 8,64,000 ల ద్వాపరయుగం ముగిసి, 4,32,000 సం॥ములు కలియుగ కాలంలో ఉన్నామని లెఖ్ఖలు గట్టారు.

43,29, 2000 ల్కు ఒక మహాయుగం ముగియుననీ, అది బ్రహ్మకొక పగటి పూటతో సమానమని హరియొక్క మహాయుగము రాత్రి యగునని వ్రాక్రుచ్చిరి. ఇలాటి వెయ్యి యుగములు శ్రీమహావిష్ణువుకు 'ఘడియ' యగునట.

బ్రహ్మకు ఒక రోజులో 14 మన్వంతరాలుండును. ఇప్పటికి స్వాయంబవ, సార్వోచిప, ఉత్తమ, తామస, రైవత, రాక్షస మన్వంతరాలు గడిచి వైవస్వత మన్వంతరంలో ఉన్నాం.

జ్యోతిష శాస్త్ర ప్రకారం 27 నక్షత్రాలు, నక్షత్రానికి నాలుగు పాదాలు చొప్పున 108 పాదాల్ను పన్నెండు రాసులుగా ఏర్పాటు చేశారు. మేషం మొదలు మీనం వరకూ గల రాశుల్లో చంద్రుడు ఒక్కొక్క నక్షత్రంలో ఒక్కొక్క రోజు ఉంటాడు. సూర్యుడు మాత్రం ఒక్కొక్క రాశినుంచీ మరో రాశికి మారడానికి సం॥ము పడుతుందని. శాస్త్రవేత్తలు గడించారు. సూర్యుని సంచారనుసారం సౌరమానమనీ, చంద్రుని సంచారానుసారం చంద్రమానమనీ, బృహస్పతి సంచారానుసారం బార్హస్సత్య మాసమనీ 3 విధాలుగా జనులు కాలాన్ని, కాలగమనాన్ని పాటిస్తున్నారు. ఋతువుల్లోని తొలి ఋతువు వసంత ఋతువు, మాసాలలో తొలి మాసం చైత్రం, పక్షాలలో తొలి పక్షం శుక్లపక్షం. తిధుల్లోని తొలి తిథి పాడ్యమి.

**చైత్రమాసి జగత్ బ్రహ్మ**
**సనర్జ ప్రధమే హని**
**శుక్లపక్షే సమగ్రంతు**
**తథా సూర్యోదయే తథా**

సూర్యోదయ సమయంలో ఇలా చైత్రమాస, శుక్లపక్ష పాడ్యమి తిథి ఉంటుందో అదే ఉ(యు)గాది. అయితే తెలుగువారు చాంద్రమానం ప్రకారం ఉగాదిని పాటిస్తున్నామని ఈ శ్లోకం ఎరుక పరస్తుంది.

**స్మరేత్సర్వ కర్మాదే**
**చాంద్రం సంవత్సరం సదా**
**నాన్యం యస్మాద్వృత్సరాదే**
**ప్రకృతి సన్య కీర్తితం**

అనే స్మృతి వాక్యానుసారం చాంద్రమానాన్నే అందరూ ఆచరించాలని పేర్కొనడం జరిగింది. ●


రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై



# 'కన్యాశుల్కం' తొలి నాటకం ప్రదర్శన 18 ఆగస్టు 1892 జరిగింది

**1892** సంవత్సరం ఆగస్టు 18వ తేదీన గురజాడ అప్పారావు విరచిత 'కన్యాశుల్కం' నాటకం తొలి ప్రదర్శనం జరిగింది. అంటే ఆనాడే తెలుగు భాషా వ్యావహారికోదయం అయిందని భావించాలి. కథలైనా, నాటకాలైనా, ఏ తెలుగు రచనలైనా గ్రాంథికంలోనే సాగేవి.

*గురజాడ అప్పారావు మహోదయులు విశాఖపట్టణం జిల్లా ఎలమంచిలి తాలూకా రాయవరం గ్రామంలో వేంకట రామదాసు కౌసల్య దంపతుల పుత్రరత్నంగా 1862 సం॥ము సెప్టెంబరు 21న మాతామహుల ఇంట జన్మించారు. 1884 సం॥లో విజయనగరం రాజావారి హైస్కూలులో రు.25లు నెల వేతనమ్మీద ఉపాధ్యాయునిగా చేరి, 1886లో బి.ఏ పట్టభద్రులై, ఆ పట్ట ప్రభావంతో 1887 సం॥ములో రాజావారి కళాశాలలో నెలకు 100 రూపాయలు నాలుగు రెట్ల జీతంతో ఇంగ్లీషు లెక్చరర్‌గా నియమించబడ్డారు. ఆ సంవత్సరంలోనే ఆంగ్ల పత్రికలో వ్రాసిన ఒక ఆంగ్ల వ్యాస ప్రభావంతో విజయనగరం రాజా సాహితీ కళాపోషకులైన ఆనంద గజపతిరాజావారి దృష్టిలో పడ్డారు. ఆ దృష్టి 'కన్యాశుల్కం' నాటక సృష్టికి కారణభూతమైంది. వ్యావహారిక భాషా ఆదికవిగా గురజాడ గౌరవింపబడ్డారు.*



గురజాడ అప్పారావుగారు తెలుగు రచయిత కావడానికి కూడా 'కన్యాశుల్కం' నాటకమే మూలం. అంతవరకూ ఆయన ఆంగ్లంలోనే రచనలు చేస్తూండేవారు. ఆంగ్లపత్రికల్లో ఆయన రచనలు ప్రచురింపబడ్తుండేవి. 'ఇండియన్ లీజర్ అవర్'లో ప్రచురితమైన వ్యాసాన్ని గురజాడ వారిలో మంచి రచయిత ఉన్నారని గుర్తించినవారు విజయనగరం మహారాజా ఆనందగజపతి రాజావారే.

ఆ రోజుల్లోనే బి.ఏ. పట్టభద్రులై, మహారాజా రాజావారి కళాశాలలో ఇంగ్లీషు లెక్చరర్‌గా రు.100లు వేతనం పని చేస్తుండేవారు. ఇటు ఆంగ్ల బోధకునిగా, అటు ఆంగ్ల రచయితగా ఆంధ్రేతరుల అభిమానం పొందారు. తెలుగులో ప్రసిద్ధమైన 'సారంగధర'ను ఆంగ్లంలోనికి అనువదించారు.

ఆ రోజుల్లో ఆంధ్రదేశంలో డబ్బు తీసుకుని ఆడపిల్లలను వృద్ధులైన మగవారికి పెళ్లిళ్లు చేసే దురాచారం ఉండేది. దీనినెలాగైనా నిర్మూలించాలని ఆనందగజపతి రాజావారు భావించారు. దురాచారమును నాటకము ద్వారా జనంలోని రక్తనాళాలకు మందులా గుచ్చాలని రాజావారి సంకల్పం. అందుకు గురజాడవారే శక్తిమంతుడైన రచయితయని భావించారు, గురజాడను ప్రోత్సహించారు. తెలుగులో రచనలు చేయడం అలవాటు లేని గురజాడ తొలుత సంకోచించారు. జనులు మాట్లాడే వ్యావహారిక భాషలోనే రచన సాగించడం ఉత్తమం రాజావారు సూచించగా, విజయనగరం ప్రాంతాల్లోని గ్రామాలను సందర్శించి, అక్కడక్కడ ఇళ్లలోని జీవన విధానాన్ని, గమనాన్ని గ్రహించి 'కన్యాశుల్కం' నాటక రచనకుపక్రమించారు. రచన పూర్తియైనది, ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. నాటక తొలిప్రదర్శన, రాజావారి సహకారంతో 1892 సం॥ము ఆగస్టు 18వ తేదీన జరిగింది, జనరంజకమైంది. అలా 'కన్యాశుల్కం' నాటకం ప్రదర్శనలు జరుగుతూ, ముద్రణలు జరుగుతూ, ఇటీవల 'శతవార్షికోత్సవం' జరుపుకుంది. ముఖ్య పట్టణాల్లో వృత్తి కళాకారులూ, ఔత్సాహికులు ప్రదర్శనలు జరిపారు; బుల్లి తెరపై ధారావాహికంగా ప్రసారం కూడా చేశారు.

గురజాడ అప్పారావుగారి నుంచే, వ్యావహారిక భాష పట్ల అనురాగము, రచనలూ ప్రారంభమయ్యాయి. సమాజంలోని చెడును తూర్పారబెట్టే రచనల విషయంలోనూ, వ్యావహారిక భాషా సంబంధ వ్యాయావతార విషయంలోనూ గురజాడ అప్పారావుగారినే 'ఆద్యుని'గా చెప్పుకోవాలి. తెలుగుభాషా వ్యావహారిక ఆది దృశ్యకావ్యం కన్యాశుల్కం అనే చెప్పాలి. ఆనంద గజపతి రాజావారు 'గురజాడ అప్పారావు' గారిపై ఉంచిన నమ్మకం నిజమైంది. అప్పారావుగారు 'కన్యాశుల్కం' వ్రాసేముందూ, తొలి ప్రదర్శనలనన్తరం భవిష్యత్తులో మహా రచయిత అవుతారన్న మాటలు అక్షర సత్యములు కావడమే కాదు, ఆయన్ను ఆంధ్రదేశం 'మహాకవి'గా గుర్తించింది, గౌరవించింది.

ఈ 18 ఆగస్టుకు 'కన్యాశుల్కం' తొలి ప్రదర్శనం జరిగి 115 సంవత్సరాలు పూర్తయింది. ●

# మనవాళ్లు ఉత్త వెధవాయలోయ్ - అన్నది గిరీశం

**మ**నవాళ్లు ఉత్త వెధవాయలోయ్' అన్నాడు గిరీశం. మహాకవి గురజాడ అప్పారావు కన్యాశుల్కం నాటకం రచించి వంద సంవత్సరాలు దాడి పోయింది. ఆయన ఆ నాటకంలో సృష్టించిన గిరీశం పాత్ర చాలా గొప్పది. ఆయన ఆ పాత్రను హాస్య ప్రహసికుడి (వ్యంగ్యం)గా చిత్రించినప్పటికీనీ, ఆ పాత్రద్వారా ఎన్నో సందేశాలు చెప్పించారు. అపాత్రులందర్నీ తూర్పార బెట్టించారు. ఛాందసాలను, బాల్య వివాహ విధానాన్నీ, డబ్బున్న వృద్ధులు కన్నెపిల్లల్ని కొనుక్కుని వివాహమాడడాన్నీ, బాల్య వితంతువుల్ని గుండె గొరిగించి నాలుగు గోడల మధ్య కూర్చోపెట్టడం, సానిదాని కొంపలకు వెళ్లడం–ఇలాటివెన్నో నో ఆనాటి ఉదంతాలను తూర్పార బెట్టారు. ఆ నాటకం ఎన్ని ఘట్టి విమర్శ లకు గురియైనా, వందసంవత్సరాలు వందితులైన నటులచే ప్రదర్శింపబడింది. ఇహ గిరీశం విషయానికి వస్తే, ఆ పాత్ర ఎన్నో రచనలకు మూలమైంది. ఆ చెళుకులన్నీ ఈ నాటికీ వర్తిస్తున్నాయ్. ఆంగ్ల వ్యామోహం, మనపట్ల, మన సంస్కృతి పట్లగల అలక్ష్యం, గొప్పలకు పోవడం, స్వోత్కర్ష ఇన్నీ అన్నీ కావు.

అలాగే 'మనవాళ్లు వెధవాయలోయ్' అని అని గిరీశంచేత అనిపించారంటే మనవాళ్లు చచ్చు దద్దమ్మలూ, వాజమ్మలనే కాదు; మూర్ఖులనీ, మూఢులనీ, ఏదో ఏదో చేసి బురద పూసుకునే భ్రాష్టులనీ అర్థంగా తోస్తుంది. మన సాంప్రదాయం, సంస్కృతీ విడిచిపెట్టి అన్యంకోసం అఱ్రులార్చడం, గాకపోతే కర్మభూమీ, వేదభూమియైన మన సదాచారములను వదిలిపెట్టి, తాత్కాలిక లాభాల్ని ఆశించి, ప్రలోభాలకులోనై, అన్యమత తీర్థాలు పుచ్చుకోవడమే గాకుండా ఉన్న కొంపకు నిప్పు పెట్టే ప్రబుద్ధులు పుడతారనీ, దేశనాశనం చేస్తారనీ ఆనాడే ఆయన ఊహించారు.

ఆయన సద్బ్రాహ్మణుడై ఉండీ ఛాందసాలను విడనాడి, తన ధర్మాన్ని తాను పాటిస్తూ, అట్టడుగు వర్గాల సేమం కోసం కృషి చేశారు. అంటరానివారిగా చూచే 'మాలలను' దేవుడి గుడిలోని మాలలుగా భావించారు. అందుకే గురజాడ గారి ఈ పదద్విపదే తార్కాణం. **మంచి చెడ్డలు రెండే కులములు. మనుజులను ఎంచి చూడగ మంచియన్నది మాలమైతే మాల నేనగుదునే** – అన్నారు. గురుజాడ. నన్ను 'మాల' అనుకున్నా ఫరవాలేదు, మాదిగ అనుకున్నా ఫరవా లేదు అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు, మాడభూషి అనంత శయనం అయ్యంగార్, తెన్నేటి విశ్వనాథం వంటి బ్రాహ్మణోత్తములంతా అట్టడుగు వర్గాల ఉన్నతికే శ్రమించారు.

కానీ రాజకీయ కాలుష్యంలో పడిన వెనుకబడిన వారు తమ ఉనికి కోసం పాటుపడిన బ్రాహ్మణులు, వైశ్యులూ, క్షత్రియులనూ అణగద్రొక్కాలని చూస్తున్నారు. అది వారి తప్పుకాదు. చరిత్ర వారికి తెలియకపోవడం, తెలియనీయకపోవడం. అయిదు వేళ్లూ కలిస్తే ఎంతబాగుంటుందీనని ఎరుగకపోవడం. ●

# లేచింది నిద్ర లేచింది మహిళాలోకం దద్దరిల్లింది పురుష ప్రపంచం!

**1962** సంవత్సరంలో అనుకుంటాను, నాగిరెడ్డి చక్రపాణి గార్లకు బుద్ధిపుట్టిందో, బ్రహ్మచారియైన రచయిత పింగళి నాగేంద్రరావుగారికి స్ఫురించిందో కానీ-మహిళా లోకం నిదుర నుంచి లేస్తుందనీ నూటిలో మూడో భాగం 33 1/3 శాతం రాజకీయాల్లో పా(అ)లనా భాగం లభిస్తుందని 38 సంవత్సరాల క్రితమే భావించడం జరిగింది. అన్ని విధాలా పురుషుల్ని ఎదిరించే బలం లభిస్తుందన్నారు.

సాంప్రదాయ, సంస్కారములను స్త్రీలు పాటించిననాడు భారతదేశం ప్రపంచ దేశాలకు గురుస్థానంలో నిలువగల అవకాశం ఉన్నది.

హెచ్.ఎం.రెడ్డి గారు నిర్మించిన 'నిర్దోషి' సినిమాలో అనుకుంటాను. **పురుషుల్లోన చేవతగ్గె, ఆడదానికి మీసమొచ్చె లోకమయ్యా లోకమూ!** అనే పాటను పాడించారు. బహుశః శ్రీశ్రీగారా పాటను వ్రాశారనుకుంటాను.

ఏది ఏమైననూ భారత రాజ్యాంగపు పెద్దల (రాజ్యసభ)లో స్త్రీల 33 1/3 శాతం హక్కులు బిల్లును ప్రతిపాదించబడటం, ప్రత్యర్థుల ఎదురు బాటుకు ఎదురు బెబ్బ తిన్నట్టుగా తిని, చివరకు నెగ్గుబాటు కావడం జరిగింది. ఇది స్త్రీల విజయంగా సమ్మతి వాదులు ప్రస్తుతించడం 'వికృతి' వస్తూ 'స్త్రీ'కి కిరీటం పెట్టినదయింది.

ఉద్యోగాలు చేయడం, ఊళ్ళు ఏలడానికి అవకాశం గల స్త్రీలు గృహ కార్యకలాపాలను కూడా నిర్వహిస్తూ, భావి పౌరులు కాబోయే తమ బిడ్డల బంగారు భవిష్యత్తును ఇంట్లో తీర్చిదిద్ద కలిగిననాడు మంచి పౌరులు కాగల సంతానం అభివృద్ధి చెందుతుందని, అందరూ ఆశిస్తున్నట్టుగా భారతదేశం 2020 నాటికి ప్రపంచ దేశాల్లో అగ్రగామి దేశంగా రూపులు దిద్దుకుని ఐశ్వర్యవంతమైన అమెరికాను తలదన్నగలదని విశ్వసిద్దాం.

## ఏలయన!

**అమెరికా గానీ, చైనా గానీ, భారతదేశ ఎదుగుదలను అంగీకరించుటలేదు. భారతదేశంలో ప్రపంచాన్ని తలతన్న గలిగే విజ్ఞాన శాస్త్రజ్ఞులు, సత్యసంధత గల ఋషిరేణ్యులున్నారు. హృదయం, మేధస్సు గల ప్రతిభావంతులున్నారు. ప్రతీదానికీ అమెరికా వైపు పరుగులు తీయడం అసమర్థుల లక్షణం.**

**అమాయక స్త్రీల్లారా! ఆదిభిక్షువైన శంకర భగవానుడు తనువులోని అర్ధభాగాన్ని సతీమణి పార్వతికి ఒసగినాడు. విష్ణువూ, రాముడూ తమ పత్నులకు ముఖ్యస్థానమిచ్చి, హృదయాన నిలుపుకున్నారు. వామాంకమున నిలుపుకున్నారు.**


**అపత్నుడు ఏ శుభాశ్శుభకార్యక్రమానికీ అనర్హుడవని అందరు లెక్కించారు. భారత ఇతిహాస, పురాణ, సాంప్రదాయాలను సారంగా చూస్తే స్త్రీకి అగ్రస్థానం ఉంది. ఇది అర్థంచేసుకోలేని వారు స్త్రీని అధమాధ అబలగా తయారుచేశారు. ఇతిహాసాల్లో శ్రీరాముడు, చరిత్రలో ఛత్రపతి శివాజీ మహారాజు స్త్రీకి ఇచ్చిన గౌరవం పూర్ణమైనది.**





**లేచింది! నిద్రలేచింది మహిళాలోకం**
**దద్దరిల్లింది పురుష ప్రపంచం!**
**లేచింది నిద్రలేచింది మహిళాలోకం**
**దద్దరిల్లింది పురుష ప్రపంచం**
**లేచింది మహిళాలోకం**
**చరణం : 1**
**ఎపుడో చెప్పెను వేమనగారు**
**అపుడే చెప్పెను బ్రహ్మంగారు ॥ఎపుడో॥**
**ఇపుడే చెబుతా ఇనుకో బుల్లెమ్మా..**
**ఆ ఆ ఆ**
**ఇపుడే చెబుతా ఇనుకో బుల్లెమ్మా**
**విస్సన్న చెప్పిన వేదం కూడా ॥లేచింది॥**
**చరణం : 2**
**పల్లెటూళ్ళలో పంచాయితీలు**
**పట్టణాలలో ఉద్యోగాలు**
**॥పల్లెటూళ్లలో॥**
**అది ఇది ఏమని అన్ని రంగముల**
**మగధీరులనెదిరించారు**
**నిరుద్యోగులను పెంచారు ॥లేచింది॥**
**చరణం : 3**
**చట్టసభలలో సీట్లకోసం**
**భర్తల తోనే పోటీ చేసి**
**॥చట్టసభలలో॥**
**ఢిల్లీ సభలో పీఠం వేసీ... ఆ ఆ ఆ**
**ఢిల్లీ సభలో పీఠం వేసి లెక్చరులెన్నో దంచారు**
**విడాకుల చట్టం తెచ్చారు**
**లేచింది నిద్ర లేచింది**
**నిద్ర లేచింది మహిళాలోకం**







# దేశంలో రెండో ప్రాచీన శివాలయం

# గుడిమల్లం

గుడిమల్లం గ్రామం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా ఏర్పేడు మండలంలో వుంది. ఈ గ్రామం రేణిగుంట రైల్వేస్టేషన్ నుంచి 10 కోలోమీటర్లు, తిరుపతి నుంచి 25 కిలోమీటర్ల దూరంలో వుంది.

గుడిమల్లంలోని పరశురామేశ్వర ఆలయంగా పిలవబడుతున్న శివాలయం చాలా ప్రాముఖ్యత వహించిన దేవాలయం.

ఈ ఆలయంలోని శివలింగంపైన శివుడు తన పూర్తి శరీరంతో మనకి దర్శనం ఇస్తాడు. ఈ శివలింగం క్రీ.పూ. 2-3 శతాబ్దాల కాలం నాటిదని, మన దేశంలోనే రెండవ అత్యంత ప్రాచీనమైనదని, దక్షిణ భారతదేశంలోని అత్యంత ప్రాచీన శివాలయమని తెలుస్తోంది. బీహార్‌లోని కైమూర్ జిల్లాలోని ముండేశ్వరి దేవాలయంలోని శివలింగం మన దేశంలోని అత్యంత ప్రాచీనమైన శివుడి ఆలయమని, అది క్రీ.పూ. 635 కాలం నాటిదని చరిత్రకారులు చెబుతున్నారు.

దక్షిణ భారతదేశంలో మనకి ప్రస్తుతం లభ్యమవు తున్న ప్రాచీన శిల్పాలుగా చెప్పబడుతున్న పల్లవుల కాలం (క్రీ.శ. 7వ శతాబ్దం) వాటి కన్నా పురాతన విగ్రహంగా గుడిమల్లం లోని శివలింగాన్ని పేర్కొన వచ్చును. లింగంపైన శివుడి పూర్తి ఆకారంతో మలచ బడ్డ ఈ విగ్రహం దక్షిణ భారతదేశంలో మనకి మరెక్కడా కానరాదు.


ఉజ్జయినిలో చారిత్రిక తవ్వకాలలో లభించిన క్రీ.పూ. 3వ శతాబ్దానికి చెందిన రాగి నాణాలలో వున్న బొమ్మలు గుడిమల్లంలోని విగ్రహాన్ని పోలివుండుట గమనించదగ్గ విషయం. ఉత్తర భారతదేశంలోని మథుర మ్యూజియంలో 1 వ శతాబ్దానికి చెందిన శిల్పం కూడా గుడిమల్లంలోని విగ్రహాన్ని పోలి ఉంటుంది.

గుడిమల్లం లోని శివుడి విగ్రహం, దాని చుట్టూ వున్న దీర్ఘ చతురస్రాకారంలోని రాతి కట్టడానికి కాలానంతరం సుమారు వెయ్యేళ్ళ తరువాత ప్రస్తుతం వున్న ఆలయం కట్టినట్లు తెలుస్తోంది. ఈ దేవాలయం 1954 నుంచి కేంద్ర పురావస్తు శాఖవారి ఆధీనంలో ఉన్నప్పటికీ భక్తుల సందర్శనానికి, ఆలయంలో ధూప దీప నైవేద్యాలకీ నిషేధాలు లేవు.


గుడిమల్లంలోని నిలుచోని వున్న శివుడి దక్షిణ హస్తంలో తలక్రిందులుగా బంధింపబడివున్న వృషభం కనిపిస్తుంది. శివుని వామహస్తంలో గోళాకారంలో వున్న భిక్షపాత్ర, ఎడమ భుజం మీద పరశు (గొడ్డలి) దర్శనమిస్తాయి. లింగం మీద మలచబడ్డ ఈ శివుని విగ్రహం కుబ్జ రూపంలో వున్న ఒక యక్షుడి బాహు వులమీద నిలబడి, ఒక వేటగాడికిమల్లే గోచరిస్తుంది. గుడిమల్లం లోని శివుని విగ్రహం వేదకాలంనాటి రుద్రుడి ప్రతిమని పోలివుంటుంది. గుడిమల్లం గ్రామాన్ని కూడా ఒకప్పుడు 'విప్రమిత' మరియు 'బ్రాహ్మణ అగ్రహారం'గా పిలిచేవారని తెలుస్తోంది. ఈ ఆలయంలోని శివలింగం పైన వున్న కుబ్జ యక్షుడు బ్రహ్మకి ప్రతీకగా, భుజాన పరశుతో దర్శనమిచ్చే శివుడు శ్రీ మహావిష్ణువుకు చిహ్నంగా, పురుష లింగాకారంతో వున్న విగ్రహం శివునిరూపంగా, త్రిమూర్తులు ఈ ఆలయం లోని విగ్రహంలో కొలువైనట్టు భక్తులు భావిస్తారు.

ఉత్తరాయణం నుంచి దక్షిణాయణానికి భానుడు ప్రవేశించినప్పుడు సూర్యుడి కిరణాలు ఈ ఆలయంలోని శివుడి పాదాల మీద ప్రసరిస్తాయి. ఈ ఆలయంలో శ్రీ ఆనందవల్లి (పార్వతి), శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రమణ్యస్వామి, సూర్య దేవుడు, విఘ్నేశ్వరుడి ఉపాలయాలు వున్నాయి.

ఈ ఆలయంలో లభించిన శిలాశాసనాలలో క్రీ. శ. 842-904 కి చెందిన పల్లవ రాజ వంశస్థుడైన బాణుడి శిలాశాసనం అతి ప్రాచీనమైనది కాగా, క్రీ.శ. 1346 నాటి యాదవ దేవరకి చెందినది చిట్టచివరిది. క్రీ.శ. 1346 కాలం నాటి విక్రమచోళుడి శాసనాన్ని బట్టి క్రీ.శ. 1126 లో ఈ ఆలయం గోపురంతో సహా పునరుద్ధరింపబడినట్టు తెలుస్తోంది. ఆలయమంతటా పవిత్రమైన వాతా వరణంతో, ప్రశాంతమైన పరిసర ప్రాంతాలతో భక్తులకి ఆధ్యాత్మిక భావాన్ని కలిగిస్తుంది. గుడిమల్లానికి దగ్గరలో రేణిగుంట, తిరుపతి రైల్వే స్టేషన్లు మరియు రేణిగుంట విమానాశ్రయం వున్నాయి. **- డాక్టర్. బీ.యస్.వీ. పార్థసారథి**

# అసలైన భారతీయుడు 'భారతరత్న' గుల్జారీలాల్ నందా



అసలైన భారతీయుడు, నీతి నిజాయితీలకు నిదర్శనం, రెండుసార్లు ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా చేసిన ఏకైక నాయకుడు (1964లో జవహర్ లాల్ నెహ్రూ మరణించినప్పుడు, 1966లో లాల్ బహదూర్ శాస్త్రి అకస్మాత్తుగా మరణించినప్పుడు) పిల్లలను రాజకీయాలకు దూరంగా సామాన్య పౌరులుగా పెంచిన అరుదైన తండ్రి. పదవీ విరమణ అనంతరం ముగ్గురు పిల్లలున్నా వారి మీద ఆధారపడకూడదనే ఆత్మాభిమానంతో చిన్న అద్దె ఇంట్లో భార్యతో అజ్ఞాతంగా జీవితాన్ని గడిపిన అసామాన్యుడు. అద్దె చెల్లించలేదనే కారణంతో తనకున్న చాపను, పాత పరుపును, వంట పాత్రలను ఇంటియజమాని రోడ్డు మీదకు విసిరివేస్తే తాను మాజీ ప్రధానమంత్రినని వెల్లడించని మహా మనీషి. ఒక విలేకరి గుర్తుపట్టి పేపర్లో వేస్తే భారతజాతి నిర్ఘాంతపోయింది. ఆ రోజుల్లో మాజీ మంత్రులకు పెన్షన్ సౌకర్యం ఉండేది కాదు. స్వాతంత్ర్య సమరయోధులకు మాత్రం రూ.500/- పింఛను ఉండేది. ఆయన ఆకలి బాధలు చూడలేక స్నేహితులు స్వాతంత్ర్య సమరయోధుల పెన్షను కోసం దరఖాస్తు పెట్టమని వత్తిడి చేశారు. "నేను దానిని ఆశించి స్వరాజ్య సాధనకోసం పోరాడలేదు కదా" అని ఆయన ఆ సూచనను తిరస్కరించాడు. అయితే ఆయన కటిక దారిద్ర్యం చూడలేక వారు ఆయన దగ్గరున్న చనువుతో బలవంతాన అర్జీ మీద సంతకం పెట్టించారు. చివరకు ఎప్పటికో అది మంజూరైంది. ఆ 500/ రూ॥ల పెన్షన్తోనే జీవితాంతం ఆయన గడిపాడు. ఆయనే అసలైన భారతీయుడు, మాన్యులలో అసామాన్యుడు 'లాలా గుల్జారీలాల్ నందా'. చనిపోవటానికి రెండేళ్ళ ముందు 'భారతరత్న' బిరుదునిచ్చారు.

గుల్జారీలాల్ నందా 1898 జులై 4వ తేదీన పంజాబ్‌లోని సియాల్ కోట్లో జన్మించాడు. (ప్రస్తుతం ఇది పాకిస్తాన్లో ఉంది.) పంజాబ్లోనే ఆయన పెరిగాడు. లాహోర్, ఆగ్రా, అలహాబాద్‌లలో విద్యాభ్యాసం చేశాడు. 1920-21లో అలహాబాద్ విశ్వ విద్యాలయంలో కార్మిక సమస్యల గురించి పరిశోధన చేశాడు. తరువాత బొంబాయిలోని నేషనల్ కాలేజీలో ఎకనమిక్స్ ప్రొఫెసర్గా జీవితం ప్రారంభించాడు. అయితే మహాత్మాగాంధీ పిలుపు మేరకు సహాయ నిరాకరణ ఉద్యమంలో రెండుసార్లు జైలుశిక్ష అనుభవించాడు.

1937లో బొంబాయి లెజిస్లేటివ్ అసెంబ్లీలో మెంబరుగా ఎన్నికయ్యారు. లేబర్ మరియు ఎక్సైజ్ శాఖలకు పార్లమెంటరీ సెక్రటరీగాను, 1946-50 మధ్య కాలంలో సెక్రటరీగాను పనిచేశారు. విధి నిర్వహణలో భాగంగా "ఇండియన్ నేషనల్ యూనియన్ కాంగ్రెస్" (INTUC) ఏర్పాటు చేయడంలో ప్రముఖ పాత్ర వహించారు. దరిమిలా ఐ.ఎన్.టి.యు.సి.కి అధ్యక్షునిగా ఎన్నుకోబడినారు. 1947లో జెనీవా, స్విట్జర్లాండ్‌లలో జరిగిన 'ఇంటర్నేషనల్ లేబర్ కాన్ఫరెన్స్'లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు.

భారత ప్రభుత్వంలో అనేక పర్యాయాలు క్యాబినెట్ మంత్రిగాపనిచేశారు. 1951లో ప్రణాళికా శాఖ మంత్రిగా పనిచేశారు. మరుసటి సంవత్సరమే లోక్‌సభ ఎన్నికల అనంతరం ఇరిగేషన్ మరియు పవర్ శాఖలను కూడా ఆయనకు అప్పగించారు. 1957లో లేబర్, ఎంప్లాయిమెంట్ మరియు ప్లానింగ్ శాఖలకు బాధ్యతలు చేపట్టారు.

1962-63లో లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ 1963-66లో హోంశాఖా మంత్రిగా మరియు ఆపద్ధర్మ మంత్రిగా 1970-71లో రైల్వే మంత్రిగా చేశారు. ప్రధానమంత్రి ఆకస్మికంగా ఖాళీ అయిన రెండు సందర్భాలలోను (1964, 1966) ఆయననే ఆపద్ధర్మ ప్రధాన మంత్రిగా చేశారంటే ఆయన ఎంతటి నిష్కళంక నాయకుడో అర్థమవుతుంది. ఆయన నీతినిజాయితీలకు, ప్రజ్ఞా పాటవాలకు, దేశభక్తికి గీటురాయిగా నిలుస్తాయి.

1997లో భారతదేశపు అత్యుత్తమ ఆయనను గౌరవించారు. 1998 జనవరి తేదీన ఆయన మరణించారు. **- డాక్టర్ దొడ్డపనేని ప్రసాద్ గ్రంథాలయ సర్వస్వం**

# పుస్తకాలెందుకు?



పుస్తకాలను మనం ఎందుకు చదువుతాము? ఆత్మబోధన కోసం, ఆత్మ వినోదం కోసం, ఆత్మ శిక్షణ కోసం - మొదలైన ప్రయోజనాలకోసమే కాకుండా ఇంకా గొప్ప ప్రయోజనాలకోసం కూడా మనం పుస్తకాలను చదువుతాము. మన వ్యక్తిగత అనుభవాల పరిధి చాలా సంకుచితమైనది. మన అనుభవాలపైన మాత్రమేం ఆధారపడినప్పుడు మనం కూడా సంకుచితంగా తయారవుతాము. పుస్తకాలు అలాకాదు లెక్కలేనంతమంది అనుభవాలను మన ముందుంచుతుంది. ఇందులో చాలామంది మనకంటే ముందుతరం బుద్ధిమంతులు, వివేకవంతులుంటారు. వారి అనుభవాలను ఆధారం చేసుకుని మనం మన సంకుచితమైన గానుగ ఎద్దుల్లాంటి జీవితం నుండి బయటపడగలం. నిదానంగా ఆత్మోన్నతి జరిగినప్పుడు మనం పర్వత ప్రాంతాల మధ్యనున్న తాజా విశాల దృశ్యాలను చూడగలుగుతాము. ఆవిధంగా మన దృష్టి రోజు రోజుకు విశాలంగా మారుతుంది. మన వయసుకు బుద్ధికి తగ్గ విశాల దృష్టి ఆ నిష్పత్తిలో లభిస్తుంది. అప్పుడు అల్పమైన లేదా అశాశ్వతమైన రాగద్వేషాలు మనల్ని ముంచలేవు. ఎలావాటిని స్వీకరించాలో అలా స్వీకరించే గుణం అలవాటవుతుంది. ఈ అలవాటు చేసుకున్నప్పుడు సంపూర్ణ జీవితాన్ని చూడగలిగి, చక్కగా జీవించగలుగుతాము.

**- జవహర్లాల్ నెహ్రూ**

# అలుపెరగని సాహితీ కర్షకుడు విద్వాన్ విశ్వం



**"వజ్రాదపి కఠో రాణి, మృదూని కుసుమాదపి, లోకోత్తరాణాం చేతాంసి"** అని విశ్వం 'ఎలిజీ' అనే లోకోక్తి వ్యాసంలో రాసుకున్నారు. అదేవిధంగా విశ్వం వజ్రం కంటే కఠినాత్ములు, పూలకంటే సుకుమారులు. విద్వాన్ విశ్వం అంటే నేటి తరానికి అస్సలు తెలియదనేది నిజం. అత్యంత పేరు ప్రతిష్టలున్న పాత్రికేయులని నేటి పాత్రికేయ మిత్రులలో అధిక శాతం మందికి తెలియదు.

కవిగా, రచయితగా, అనువాదకునిగా, స్వాతంత్ర్య సమరయోధునిగా, కాంగ్రెస్ వాదిగా, కమ్యునిస్టుగా, అభ్యుదయ వాదిగా, జర్నలిస్టుగా, కాలమిస్టుగా వివిధ పార్శ్వాలు కలిగి ప్రతిదానిలో తనదైన ముద్రవేసి, ఆరు దశాబ్దాలకు పైగా సాహిత్య సేద్యం చేసిన విశ్వం గారి రచనలపై జరగాల్సిన స్థాయిలో పిహెచ్‌డి పరిశోధనలు జరిగినట్లు కనిపించడం లేదు. డా. నాగసూరి వేణుగోపాల్, కోడి హళ్ళి మురళీమోహన్ 'సాహితీ విరూపాక్షుడు' అనే వ్యాస సంకలనాన్ని విశ్వం శతజయంతోత్సవ సందర్భంగా తీసుకువచ్చారు. డా.మేడేపల్లి రవికుమార్ కూడా ఇటీవల వీరి రచనలపై సిద్ధాంత వ్యాసాలను ఆహ్వానించారు. వీరందరికీ తెలుగు సాహితీ లోకం రుణపడే ఉంటుంది. విశ్వంకి ఆరు యూనివర్శిటీలు గౌరవ డాక్టరేట్ ఇచ్చి గౌరవించాయి.

తిమిరంతో సమరం అనారతం కొనసాగించడమే కవిత్వం' అనే భావనతో సాహితీ ప్రయాణం చేసిన అలుపెరగని పథికుడు విద్వాన్ విశ్వం. 1915 అక్టోబర్ 21న లక్ష్మమ్మ, మునిరాములు దంపతులకు, అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో జన్మించిన విశ్వం తన పద్నాలుగవ ఏట మొదలుపెట్టిన రచనా వ్యాసాంగం 1987 అక్టోబర్ 19 వ తేదీన వారు మరణించేవరకూ (విశ్వం గారి గురించి ముద్రితమైన కొన్ని గ్రంథాలు, వ్యాసాలలో వారి మరణించిన తేదీ 20.10.1987 అని ఉంది. అది తప్పు అని వారి కుమార్తె కాదంబరి విశ్వం గారు ధృవీకరించారు) కొనసాగింది. వీరి అసలు పేరు విశ్వ రూప శాస్త్రి. (వీరికి సంబంధించి వీరి స్నేహితులు రాసిన కొన్ని వ్యాసాలలో, ప్రచురించబడ్డ కొన్ని గ్రంథాలలో వీరి అసలు పేరు విశ్వరూపాచారి అని, కర్నూలు లోని వారి గురువులు విశ్వం గారి పేరును విశ్వరూపశాస్త్రిగా మార్చి నట్లు రాసి ఉంది. అయితే అది తప్పు మొదటి నుంచి తన తండ్రి పేరు విశ్వ రూపశాస్త్రి అని వారి కుమార్తె కాదంబరి గారి ఉవాచ) చాలాకాలం విశ్వరూప శాస్త్రిగానే వీరి రచనలు కొనసాగాయి. అనంతరం వీరి రచనలన్నీ విద్వాన్ విశ్వం పేరుతోనే ప్రచురితమయ్యాయి. కొన్ని వ్యాసాలు, కాలమ్‌లలో 'విశ్వం' అని మాత్రమే కనిపించేవి. యువకులలో జాతీయ భావం పెంపొందించేందుకు కృషి చేశాని విశ్వం తండ్రి మునిరాములు ప్రభావం కూడా విశ్వంలో ప్రస్ఫుటిస్తుంటుంది.

తెలంగాణా నేపథ్యంలో దాశరధి వారి "కోటి రతనాల వీణ నా తెలంగాణా"కు వచ్చినంత ఖ్యాతి, రాయలసీమ కన్నీటి పాట 'పెన్నేటి పాట' కూ వచ్చింది. ఆ పాటను రాయలసీమలో ఓ జానపదం లా పాడే వారూ ఉన్నారని చెబుతుంటారు. సీమ క్షామాన్ని "ఏది నీరు, ఏది హోరు, ఏదీ నీటిజాలు ఇదే నీరు, ఇదే హోరు, ఇదే ఇసుక వాలు" అంటూ రాయల్లసీమ మండలికంలో పెన్నేటి పాటై పిక్కటిల్లిన ఆయన ఆగ్రహంతో ఆంధ్రదేశమంతా గొంతు కలిపిన కావ్యం అది. "చిన్న కావ్యంలో పెద్ద హృదయాన్ని విశ్వంగారు ఆవిష్కరించారని" ఈ కావ్యానికి ముందుమాట రాసిన రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ కొనియాడారు. పెన్నేటి పాట కావ్యం చదివిన యాదాటి కాశీపతి "ఓ ప్రవహించేనది, పురోగమించే సమాజం, సమాజం గుండెచప్పుడు, జనుల భావాల ఆక్సిజన్ విశ్వం గారం"టారు.

ఇదే స్థాయిలో రాయలసీమలో 1983 అక్టోబర్ 4న జరిగిన ఓ యధార్థగాథను కవితా వస్తువుగా విశ్వం గారు రాసిన 'ఒకనాడు' అనే కావ్యం కూడా చాలా ప్రసిద్ధి చెందినది. విశ్వం గారి కంద పద్యాలు పాము మెలికలు తిరిగినంత సొగసుగా తిరుగుతాయని 'ఒకనాడు' అనే ఈ కావ్యానికి ముందు మాట రాసిన విశ్వనాథ సత్యనారాయణ గారు విశ్వం గారిని ప్రశంసించడం విశేషం. "విశ్వం కందాలు మాకందాలు" అని ఆరుద్ర గారు అంటారు. ఆనాటి నుంచి వీరు కంద పద్యాలను తప్ప వేరే చందస్సులో పద్యాలు రాయలేదన్న విషయాన్ని ఆరుద్ర ఓ వ్యాసంలో స్పష్టం చేశారు.

'మీజాన్' వంటి పత్రికలో తన పాత్రికేయ ప్రయాణాన్ని మొదలుపెట్టి అనేక పత్రికలలో వివిధ హోదాలలో పనిచేసి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికకు సంపాదకునిగా తన సాహితీ సేవ కొనసాగించారు. ఆంధ్రప్రభ సచిత్రవారపత్రికలో పదవీవిరమణ చేసిన తరువాత 1981నుండి తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల విభాగానికి ప్రధాన సంపాదకునిగా అసువులు బాసేవరకూ వ్యవహరించారు. పత్రికలలో తనదైన ముద్రవేసి ఆయా పదవులకి వన్నె తెచ్చారు. ఈ సమయంలో 'కథాసరిత్సాగరాన్ని' 12 సంపుటాలుగా విశ్వంగారు తెనుగించాడు. బ్రహ్మసూత్రాలు శంకరభాష్యం నాలుగు సంపుటాలను, అధర్వణ వేదాన్ని అనువాదం చేసి ప్రచురించారు. వారు అభ్యుదయ రచయితల సంఘ సంపాదకులుగా మద్రాసు వెళ్ళిన కొత్తల్లో వ్యవహరించారని ఒకరిద్దరు మాత్రమే వారి వ్యాసాల్లో పొందుపరిచారు. ఇక వీరి కాలమ్స్‌లో తెలుపు-నలుపు, అవీ ఇవీ, ఈవేళ, టీకా టిప్పణి, మాణిక్య వీణ వంటివి కొన్ని ఉదాహరనలు మాత్రమే! రచయిత్రి మాలతీచందూర్ విశ్వం గారి గురించి రాస్తూ, కవి రచనలో భావాన్ని ఏమాత్రం కదిలించకుండా రచనలను యథాతథంగా ప్రచురించడం ఎడిటర్ గా విశ్వంగారి ప్రత్యేకత అని కొనియాడారు.

వీరి తాతగారు 'రుద్రాక్ష విభూతి మహత్యం' వంటి ప్రబంధాలను, సక్కుబాయి వంటి హరికథలను, దాదాపు 20 పైగా వ్రాసినట్లు, మానస బోధ, పరమార్థ సారము వంటి శంకర కృతులను అనువాదం చేసినట్లు వాటిని వావిళ్ల వారు ప్రచురించినట్లు డా. దివాకర్ల వెంకటావధాని గారు తెలిపారు. ఆ ప్రభావం విశ్వం గారి అనువాదాల ప్రక్రియకు నాంది అయి ఉండవచ్చు కూడా.

వీరి అనువాదాలలో చెకోవ్, ఇబ్సన్, బెర్నార్డ్ షా గార్ల నాటికలు, గోర్కి జీవితం, ఐరిష్ నవలా రచయిత ఓ ఫ్లే హార్టీ నవల, రజనీ పామీదత్ రచించిన ఇండియా టుడే గ్రంథం, రవీంద్రుని నాటికలు, కాళిదాసు రచించిన రఘువంశం,



కుమార సంభవం, మేఘ సందేశం, మాఘుడు రాసిన శిశుపాలవథ, భాణభట్టు రాసిన కాదంబరి, భారవి రాసిన కిరాతార్జునీయం, దండి కవుల దశకుమార చరిత్ర, బాలల కోసం విష్ణుశర్మ రాసిన పంచతంత్ర కథలను అనువదించారని అనేకమంది రచయితలు తెలిపారు కానీ, మాదాం మాంటిసరీ వ్రాసిన గ్రంధాలను శిశు హృదయం, శిశు రహస్యం పేర్లతో విశ్వం అనువదించారు. "మూలం అర్థం ఏమాత్రం చెడకుండా తెలుగుమాధుర్యంతో అనువదించడం వీరి ప్రత్యేకత" అని డా దివాకర్ల వెంకటావధానిగారంటారు. "కాళిదాసుకే మెరుగులు దిద్దడం అంటే ఛాందసులు చెవులు మూసుకోవచ్చు. కానీ నిజం చెప్పకతప్పదు. 'మృధు రత్న చాయా' శ్లోకంలోని 'యేనశ్యాం' అనే పాదాన్ని విశ్వం గారు 'ఓహో' అనిపించేలా అనువదించారు" అని ఓ సందర్భంలో ఆరుద్రగారన్నారు.

బాలల కోసం వీరు రాసిన దాదాపూ 50 కథలు దేశీ కవితామండలి వారు 5 సంపుటాలుగా ముద్రించారు. వీరి నాటికలు విక్రమోర్వశీయ'నాగానందం'లు, 'యుద్ధం మాకొద్దు' అనే ఐదు నాటికలు ఆకాశవాణిలో ప్రసారమై విస్తృత ప్రచారం పొందాయి. "చందమామ"లో ద్విపద కావ్యం రూపంలో వ్రాసిన పంచతంత్ర కథలను బాపు బొమ్మలతో తి.తి.దే.ప్రచురణగా వెలువరించారు. "వస్తువుకు తగిన వాతావరణ కల్పన, ఆ నుడులవడిలో జడిగా కురిపించి రస రమ్యత సాధించగల నేర్పు విశ్వంకు ఉగ్గుపాలతో పెట్టిన విద్య" అని తిరుమల రామచంద్ర గారు విశ్వం గారిని ప్రస్తుతించారు.

"కమ్యూనిస్టు యోధులైన లెనిన్, స్టాలిన్ వంటి వారి గురించి విశ్వం గారు రాసిన వ్యాసాలు, ఆనాడు యువకుల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించాయి" అని డా దివాకర్ల వెంకటావధాని గారు 1976 లో జరిగిన ఆంధ్ర సాహిత్య పరిషత్ సమావేశంలో తన ప్రసంగంలో పేర్కొన్నారు.

తరిమెల నాగిరెడ్డి గారితో కలసి ఫాసిజం పుస్తకాలను ప్రచురించడమే గాక, 'యుద్ధం వల్ల కలిగే ఆర్థిక ఫలితాలు' అన్న కరపత్రం రాసి ప్రచురించినందుకు అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం వీరిని అరెస్ట్‌చేశారు. అయినా స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్‌ని ఉద్యోగంలో (ప్రైవేట్ ఉద్యోగమైనప్పటికీ) రిటైర్ అయ్యేవరకూ స్వీక రించక పోవడం, వీరి సిద్ధాంతాల గొప్పదనానికి నిదర్శనం.

ఒకానొక సమయంలో ఆయన కుమార్తె వినత, పెద్ద కుమారుడు బాల చంద్రుడు విషయంలో ఆయన ఎంతో కలత చెందారు. అదే విషయాన్ని విశ్వం గారు ఆయన కవిత 'స్వగతం'లో "వినత చనిపోయె బాబెటో వెడలిపోయే అయిన నిటులుంటినన్న" అని తెలిపారు.

"తన ఆత్మకథను ఆంధ్రజ్యోతిలో ప్రతి ఆదివారం రాయడం మొదలుపెట్టారు. 1987, అక్టోబర్ 20వ తేదీ ఆదివారం నాల్గవ భాగం వచ్చింది." అని సీనియర్ జర్నలిస్ట్ రాఘవ శర్మ. ఆ ఆత్మ కథ అంతటితో ఆగిపోవడం వల్ల విశ్వం గారి జీవిత వాస్తవాలు వెలుగు చూడలేదు. ఎంతో ఉన్నత శిఖరాలనందుకున్న అలు పెరగని సాహితీ కర్షకుడు విద్వాన్ విశ్వం వేళ్ల మీద లెక్కపెట్టగలిగినంత మంది హాజరవ్వగా సాదాసీదాగా, కనిపించని లోకాలకేగారు విశ్వం. ఎంతో ఉన్నతభావాలు కలిగిన, సంస్కృతాంధ్రాంగ్ల పండితుడు విద్వాన్ విశ్వంలాంటి మరో వ్యక్తి పత్రికా రంగంలో లేరంటే అతిశయోక్తికాదు.

**- కరణం కళ్యాణ్ కృష్ణ కుమార్,** సీనియర్ జర్నలిస్ట్, చీరాల
98484 28978, 8074627019

# అంతర్జాతీయ ఖ్యాతి నొందిన తాత్వికవేత్త జిడ్డు కృష్ణమూర్తి



తెలుగు వారిలో అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన తాత్వికవేత్త ఎవరయ్యా అంటే ఠక్కున సమాధానం వచ్చేది జిడ్డు కృష్ణమూర్తి.

1895 సం॥ము మే 12వ తేదీన చిత్తూరు జిల్లా మదనపల్లిలో జిడ్డు నారాయణయ్య సంజీవమ్మ దంపతుల పదకొండు మంది సంతానంలో కృష్ణమూర్తి ఎనిమిదవ వాడు. అందుకే ఆయనకు కృష్ణమూర్తి యని పేరు పెట్టారో, ఏమో! అంతర్జాతీయ ఖ్యాతిని గాంచి, గురుస్థానంలో నిలిచిన వ్యక్తి. చిన్నప్పట్నుంచీ చదువునందు వెనుకబడే వారంటారు గానీ, ఎపుడూ ఆయన దృష్టి ఏదో అన్వేషణంలో ఉంటూ వచ్చేది. అందరూ పరధ్యానంలో ఉన్నాడనుకునేవారు.

కృష్ణమూర్తి కుటుంబం ఆయన 14వ ఏటనే మద్రాసు వచ్చారు. అడయార్‌లో ఉన్న దివ్యజ్ఞాన సమాజం అధినేత్రి అనిబిసెంట్ కృష్ణమూర్తిని, అతని సోదరుడు నిత్యానంద్‌నూ దత్తత చేసుకున్నది. ఇద్దర్నీ చదువును మాన్పించింది. దివ్యజ్ఞాన సమాజంలోనే చదువుకుంటూ విదేశాలకు వెళ్ళారు. 1912 నుంచీ 1920 వరకూ అక్కడే చదువుకున్నారు. ఇంగ్లీషు ఫ్రెంచి భాషల్లో ప్రవీణులయ్యారు. ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఇన్ ది ఈస్టు' అనే సంస్థను స్థాపించారు. దాని అధిపతి జిడ్డు కృష్ణమూర్తే.

ఈ సంస్థ ద్వారా ఆయన ఎన్నో బోధనల్ని చేశారు, ఎన్నో గ్రంథాలు వ్రాశారు. తన స్వస్థల మైన మదనపల్లిలో 300 ఎకరాల స్థలాన్ని క్రయం చేసి రిషివాలీ పాఠశాలను నెలకొల్పారు.

ఎన్నో ఆధ్యాత్మిక బోధనల్ను చేసిన కృష్ణమూర్తి తన సోదరుడు నిత్యానంద్ 1925 సం॥ము నవంబర్ 14న చనిపోవడంతో ఆయన మాన సికంగా చాలా దెబ్బతిన్నారు. తేరుకోవడానికి చాలా కాలం పట్టింది.

'నీకు నీవే గురువు' అన్నారు. మనిషికి సంపూర్ణమైన స్వేచ్ఛ ఉండాలన్నారు. దివ్యజ్ఞాన సమాజంలో తనకున్న అనుబంధాన్ని తొలగించుకున్నారు. ఆయన దేశం, మతం, జాతి, ప్రాంతం అనే పరిధుల్ని చెరిపేసుకున్నారు. ప్రపంచమంతా తిరిగారు. విశ్వమానవునిగా మారారు. వేనకు వేల ప్రసంగాలు అనర్గళంగా చేశారు. ఎవరికి వారే సత్యాన్వేషణం చేసుకోవాలన్నారు. సత్ప్రవర్తకులు కావాలన్నారు. ఆయన రచనలు ఆంగ్లంలో కోకొల్లలుగా వెలువడ్డాయి. వివిధ భాషల్లోనూ వెలువడ్డాయి. అనుచరులు పెరిగారు. అయినా తాను గురువు నని పించుకోవడానికి ఇష్టపడలేదు.

విశ్వమానవునిగా కీర్తింపబడిన కృష్ణమూర్తి 1986వ సం॥ము ఫిబ్రవరి 17న ఈ ప్రపంచం నుంచీ నిష్క్రమించిన ఆత్మ పరిశోధనా యోధుడాయన. ●

# విశ్వనగర్‌లో 5 రోజులు జరిగిన విశ్వంజీ మహారాజ్ జన్మదినోత్సవాలు

మార్చి నెల 1వ తేదీ శివరాత్రి పర్వదినం నుంచీ 5వతేదీ వరకూ విశ్వనగర్‌లో విశ్వంజీ జన్మ దినోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయ్.

ఈ సంవత్సరం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దీక్ష ధారణ, అంకురార్పణ, మంటపా రాధన, సూర్యనమస్కారాలు, సవ మానసూక్త పారాయణలు, దుర్గా సప్తసతి, చండీ పారాయణం, రుద్రై కాదసని, నవగ్రహ జపాలు, ధన్వం తరీ జపము, ఆవాహిత హోమాలు, కుంకమార్చనలు, నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థ ప్రసాద వితరణతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు మార్చి 5న స్వామిజీ జన్మదిన వేడు కలు, స్వామి సందేశం ఇవ్వడం జరిగాయ్.



భారతదేశం ప్రపంచ దేశాల్లో అగ్రస్థానం వహించి అన్ని రం గాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించి, అమెరికా వంటి ఇతర దేశాలకు తలమానికం కాగలదని విశ్వంజీ ఆశాభావం వ్యక్తం చేశారు. దీనికి మన దేశంలో ఉన్న అన్ని వర్గాల మేధావులు సంఘటితంగా, తమ మేధాశక్తిని దేశ పురోగతికి, విశ్వశ్రేయస్సుకు, శాంతికి, దోహదపడే రీతిలో కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా వుందని ఆయన పిలుపునిచ్చారు.

ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ పేదలకు, విద్యార్థులకు, రోగులకు వైద్యం, దేవాలయాలు, చర్చిలు, దర్గాలకు ఆర్థిక సాయం అందించే మానవతావాది విశ్వంజీ. దత్తపరంపరలో 21 ఏళ్లు సాధన, శోధన చేసి దత్తాత్రేయ వాడికర్, మహరాజ్ గురువు ద్వారా దత్త మంత్రోపాసన పొంది, విశ్వయోగిగా పరిణామం పొంది ఒక మహాశక్తి వలయంగా శక్తిస్వరూపుడిగా మారారు. ఆయనకు జన్మనిచ్చిన తల్లి వరలక్ష్మమ్మ పేరిట ఆలయం నిర్మించారు.

భారతదేశంలోని వివిధ నగరా ల్నుంచే గాకుండా, అమెరికానుంచీ కూడా కొందరు భక్తులు విచ్చేశారు.

తల్లిదండ్రులను గౌరవించాలనీ, పంచమాతలను పూజించాలని చెబుతూ 1920 నాటికి భారతదేశం ప్రపంచ దేశాల్లో సమున్నతస్థానానికి వస్తుందని చెప్పారు. విశ్వనగర్ హోమ ధూపంతో పునీతమైంది. ఆ అయిదురోజుల బృహ త్కార్యక్రమాల్ని తన భుజస్కంధాలపై వేసుకుని నిర్వహించిన కోటేశ్వరరావు గారిని ఈశ్వరమ్మను అభినందిస్తూ న్నాం.



దాదాపు 95 ఎకరాల ఆవరణలో నిర్మించిన విశ్వ స్థూపం 45 అడుగుల వ్యాసంలో 90 అడుగల ఎత్తు కలిగి వృత్తాకారంగా విశ్వాన్ని పోలి ఉంటుంది. మతాలు వేరైనా గమ్యం ఒక్కటే దేవుడు ఒక్కడేనని చాటిచెబు తుంది. ఇది మానవత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. ఇందులో రెండు ప్రవేశ ద్వారాలున్నాయి. ఒకటి అనసూయ ద్వారము, రెండు అత్రి ద్వారం. ఎనిమిది దిక్కులలో ఎనిమిది ద్వారాలు ఉన్నాయి. ఇవి హైందవ ద్వారం, మహమ్మదీయ ద్వారం, క్రైస్తవ ద్వారం, బౌద్ధద్వారం, జైనద్వారం, జురాష్ట్రియన్ ద్వారం, సిక్కుద్వారం, నాస్థిక ద్వారాలు ఉన్నాయి. ప్రతి ద్వారం ఆయా మత చిహ్నాలతో, సూక్తులతో, వర్ణాలతో, సంప్రదాయా లతో అవగతమవుతుంది. ఇవి పంచ భూతాలను ప్రతిబింబించేలా ఇందులో 5 అంతస్తులను నిర్మించారు. ఒక అంతస్తులో శివలింగాకారంగా నిర్మించి, దానిపై దత్తాత్రేయ విగ్రహాన్ని స్థాపించారు. దానిపై ఉన్న పావురం శాంతికి చిహ్నంగా నిలుస్తుంది. ధవళవర్ణం స్వచ్ఛతకు తార్కాణం. దివ్యమైన పుణ్యస్థలం కొండవీటి కొండలకు చేరువుగా ఉండటమేకాక యోగివేమన సంచరించిన ప్రదేశమని మనకు తెలియచెబుతోంది. సందర్శనకు పైకివెళ్లి చూడడానికి మెట్లు, లిఫ్ట్ ఏర్పాటుచేశారు. దీనిలో మానవ శరీరంలో షట్చక్రాలు ఇందులో ఉన్నాయని యోగపరంగా చెప్పారు. ఇచ్చట విశ్వగురుపీఠం, వరసిద్ధి వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల విగ్రహాలను ప్రతిష్టించి మందిరాల్ని ఏర్పాటుచేశారు. అలాగే ఆంజనేయస్వామి విగ్రహం, బుద్ధుడు, రాధాకృష్ణుడు, పంచాయతనం తదితర కనువిందు చేస్తాయ్. భక్తుల కోసం గదులు, ఉచిత అన్నపూర్ణాలయాన్ని నిర్మించారు. దాదాపు 500 మంది కూర్చునేటట్లుగా అష్టసిద్ధి ఆడిటోరియం ఉన్నది. ●

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel
(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)
34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com


మీరెప్పుడు మాలోనే వున్నారు, మాతోనే వున్నారు.
- గోటేటి వెంకటేశ్వరరావు

Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97
**March 2022**

